teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 139 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 14 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## డాక్టర్ లైంగిక దాడిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

రాష్ట్రపతి, ప్రధానమంత్రిలకు జూనియర్ డాక్టర్లు లేఖ

న్యాయం జరిగేలా చర్యలకు కోరినట్లు సమాచారం



.. వివరాలు 2లో

## రాజకీయ పార్టీల ర్యాలీలపై ప్రభుత్వ నిషేధం

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన



సెప్టెంబర్ 17న జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల ర్యాలీలపై ప్రభుత్వం నిషేధం విధించినట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఉన్న కారణంగా హైదరాబాద్ మూడు కమిషనరేట్ల పరిధిలో రాజకీయ పార్టీల ర్యాలీలకు, నిరసన కార్యక్రమాలకు అనుమతి లేదని మంత్రి చెప్పారు. సెప్టెంబర్ 17

మిగతా 2 లో





## హైడ్రాను రద్దు చేయాలి

హైకోర్టులో హైడ్రా రద్దుకు పిటిషన్

జీఓ 99ను ఛాలెంజ్ చేసిన పిటిషనర్

కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు

హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైడ్రాను రద్దు చేయాలంటూ హైకోర్టులో దాఖలైనా పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ మేరకు పిటిషనర్ జీఓ 99ను ఛాలెంజ్ చేశారు. ఇందులో జీహెచ్ఎంసీ యాక్ట్‌ను కాదని హైడ్రాకు ఎలా అధికారులు ఇస్తారని పిటిషనర్ పేర్కొన్నారు. హైడ్రా చట్టబద్ధతను రద్దు చేయాలని కోరారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): హైడ్రాపై దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, హైడ్రా ఇప్పటివరకు చెరువుల ఎఫ్టీఎల్

మిగతా 2 లో



### జాతీయ విద్యావిధానం కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గురుగ్రామ్‌లో బ్రిటన్‌కు చెందిన సౌతాంప్టన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను విదేశాంగ మంత్రి జైశంకర్ యూనివర్సిటీ ప్రతినిధులకు

మిగతా 2 లో



### గిరిజన ప్రాంతాల్లోని స్కూళ్లలో వారి భాషలోనే టెక్స్ట్ బుక్స్

తగిన ఏర్పాట్లతో కేంద్రం చర్యలు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గిరిజన ప్రాంతాల్లోని స్కూళ్లలో చదివే పిల్లలకు వారి భాషలోనే టెక్స్ట్ బుక్స్ అందించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు

మిగతా 2 లో



## వినాయక నవరాత్రులకు ప్రధాని కానుక

తెలుగు రాష్ట్రాలకు మరో రెండు వందేభారత్ రైళ్ళు

కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం

తెలుగు ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వినాయక నవరాత్రులకు కానుకను అందించనున్నారు. ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే ఉద్దేశంతో రైలు కనెక్టివిటీని మరింత పెంచేందుకు తీసుకొచ్చిన వందేభారత్ రైళ్ల పరంపరలో భాగంగా మరో రెండు రైళ్లను తెలుగు రాష్ట్రాలకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఇప్పటికే 4 వందేభారత్ రైళ్లు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి సేవలందిస్తుండగా తాజాగా 5వ వందేభారత్ రైలును కూడా ప్రధానమంత్రి కేటాయించారు. ఈ రైలు సికింద్రాబాద్, నాగ్‌పూర్ మధ్య పరుగులు

మిగతా 2 లో

## జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఈ నెల 17వ తేదీన హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం పబ్లిక్ గార్డెన్ లో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని ఆమె తెలిపారు. ప్రజా పాలన దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై సెక్రటేరియెట్‌లో ఉన్నత స్థాయి

మిగతా 2 లో

### గ్రామ పంచాయతీ ఎన్నికల దిశగా మరో ముందడుగు

పంచాయతీల వారిగా ఓటర్ల జాబితా విడుదల



.. వివరాలు 2లో



## ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనం లేదు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈసారి ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనం లేదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. గణేష్ నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లో గణపతి నిమజ్జనం కోసం ఏర్పాటు జరుగుతున్నాయని

మిగతా 2 లో



### లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్

సీబీఐ, ఈడీ రెండు కేసుల్లోనూ బెయిల్ మంజూరు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కు బెయిల్ ఇచ్చింది సుప్రీంకోర్టు. సీబీఐ, ఈడీ రెండు కేసుల్లోనూ ఆయనకు బెయిల్ మంజూరు

మిగతా 2 లో

### వాహనాల రద్దీ తగ్గించేందుకు సర్కార్ సరికొత్త ఆలోచన

ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా ఉపయోగించేందుకు పరిశీలిన



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సిటీలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం, సాయంత్రం సమయాల్లో కాలనీల్లోనూ ట్రాఫిక్ జాం అవుతుంది. వాహనాల సంఖ్య కూడా

మిగతా 2 లో



### పోర్ట్ బ్లెయిర్ పేరును శ్రీ విజయ పురంగా మారుస్తాం

హోంమంత్రి అమిత్ షా ప్రకటన

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): అండమాన్ నికోబార్ దీవుల్లోని పోర్ట్ బ్లెయిర్ పేరును శ్రీ విజయ పురంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వలసవాద ముద్రల

మిగతా 2 లో

## రాజకీయ పార్టీల ర్యాలీలపై ప్రభుత్వ నిషేధం

మొదటి పేజీ తరువాయి

ఉదయం 6 నుంచి 18 సాయంత్రం 6 గంటల వరకు మద్యం అమ్మకాలు కూడా హైదరాబాద్ లో నిషేదిస్తున్నట్లు గురువారం నోటీసు జారీ చేశారు. హిందూ, ముస్లింల పండుగలు ఏకకాలంలో జరుపుకుంటున్నందున ఎలాంటి రాజకీయాలు విద్వేశాలు రెచ్చగొద్దవద్దని పొన్నం ప్రభాకర్ అన్నారు. గణేష్ నిమజ్జన శోభాయాత్ర సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ ఏర్పాట్లు చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగలు సంతోషంగా, సామరస్యపూర్వకంగా జరుపుకునేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## జాతీయ విద్యావిధానం కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం

మొదటి పేజీ తరువాయి

అందజేశారు. మన దేశంలో సౌతాంప్టన్ యూనివర్సిటీ క్యాంపస్ లో ప్రదానం చేసే డిగ్రీలు బ్రిటన్‌లో ఆ విశ్వవిద్యాలయం ప్రదానం చేసే డిగ్రీలతో సమానంగా ఉంటాయి. విద్యా, నాణ్యత ప్రమాణాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. సౌతాంప్టన్ భారత క్యాంపస్ లో 2025, జులై నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. తొలుత బిజినెస్, మేనేజ్‌మెంట్, కంప్యూటింగ్, లా, ఇంజినీరింగ్, ఆర్ట్, డిజైన్, బయో సైన్సెస్, లైఫ్ సైన్సెస్ కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

## గిరిజన ప్రాంతాల్లోని స్కూళ్లలో వారి భాషలోనే టెక్ట్స్ బుక్స్

మొదటి పేజీ తరువాయి

ట్రైబల్ భాషలోనే బుక్స్ ఉండాలని నిర్ణయించింది. గిరిజనులు ఉన్న అన్ని రాష్ట్రాలు ట్రైబల్ భాషల్లో బుక్స్ ప్రిపేర్ చేయాలని ఆదేశించింది. ఇందుకు అయ్యే ఖర్చును కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వనుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,2 తరగతుల వారికి గోండు, కోయ, బంజారా, కోలాముల భాషల్లో బుక్స్ అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు 3వ తరగతి బుక్స్ ను కూడా అధికారులు ప్రిపేర్ చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల18, 19, 20 తేదీల్లో ఈ తెగల భాషలను బోధించే టీచర్లతో ట్రైబల్ డిపార్ట్ మెంట్ హైదరాబాద్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించనుంది. ఈ నాలుగు తెగల భాషలను బోధించే టీచర్ల నుంచి సమాచారాన్ని తీసుకుని 30, 40 పేజీలతో అధికారులు బుక్స్ ను రెడీ చేయనున్నారు. 5వ తరగతి వరకు వారి బాషల్లో బుక్స్ రెడీ చేయాలని, ఇందుకు అయ్యే మొత్తం ఖర్చును కేంద్ర గిరిజన శాఖ భరిస్తుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఈ నాలుగు తెగలకు చెందిన స్టూడెంట్స్ 25వేల మంది ఉండగా వీరికి ఈ బుక్స్ పంపిణీ చేయనున్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

అధికారుల సమావేశాన్ని సీఎస్ నిర్వహించారు. ప్రజా పాలన దినోత్సవం రోజు సీఎం అమరవీరుల స్తూపం దగ్గర నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పబ్లిక్ గార్డెన్ లో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన తర్వాత ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు. సభా స్థలంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్వానితుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం, శానిటేషన్, పీఏ సిస్టం, భద్రతా తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. 17న గణేశ్ నిమజ్జనం ఉన్నందున ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ట్రాఫిక్ నియంత్రణ, తగు మార్గాలను ముందస్తుగా తెలియజేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హెూంశాఖ స్పెషల్ సీఎస్ రవి గుప్తా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కు బెయిల్

మొదటి పేజీ తరువాయి

చేస్తూ తీర్పు ఇచ్చింది అత్యున్నత న్యాయస్థానం. శుక్రవారం సుదీర్ఘంగా సాగిన వాదనల తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటించింది కోర్టు. 2024, జూన్ 26వ తేదీన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను అరెస్ట్ చేసింది సీబీఐ. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఆయన పాత్ర ఉందనే ఆరోపణలతో అదుపులోకి తీసుకుని విచారించి ఆ తర్వాత అరెస్ట్ చేసింది. సీఎం కేజ్రీవాల్ కు బెయిల్ మంజూరు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది సుప్రీంకోర్టు. సుదీర్ఘమైన జైలు శిక్ష అనేది అన్యాయంగా స్వేచ్ఛను హరించటమే అంటూ కామెంట్ చేసింది. సీఎం కేజ్రీవాల్ అరెస్ట్ సమయంలో సీబీఐ వ్యవహరించిన తీరును ప్రస్తావించింది కోర్టు. సహకరించకపోవటం అంటే నేరాన్ని అంగీకరించినట్లు కాదని ఆ కారణంతో సీబీఐ అరెస్ట్ చేయటం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు.

## డాక్టర్ లైంగిక దాడిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

తీన్మార్ న్యూస్ వెబ్ డెస్క్ (తీన్మార్ న్యూస్): ఇటీవలే దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్ జీ కర్ హాస్పిటల్ లైంగిక దాడి ఘటనపై, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో చర్చలు ముందుకు సాగకపోవడంతో కోల్ కతా జూనియర్ డాక్టర్ల నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అదేంటంటే, కోల్ కతా జూనియర్ డాక్టర్లు మరియు రాష్ట్ర ప్రభుత్వం మధ్య చర్చలు ఎంతకూ ముందుకు సాగకపోవడంతో దీనికి తక్షణమే ముగింపు పలికేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జూనియర్ డాక్టర్లు లేఖ రాశారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ తరపున రాసిన నాలుగు పేజీల లేఖను ఉపరాష్ట్రపతి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి కూడా పంపారు. కాగా, ఆ లేఖలో అతి దారుణంగా బలైపోయిన తోటి జూనియర్ డాక్టర్ కు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలకు ఉపక్రమించాలని కోరినట్లు తెలుస్తోంది.అలాగే మీరు సంస్థాగతంగా తీసుకునే నిర్ణయాన్ని బట్టే, మేము మా వృత్తిలో భయం లేకుండా విధులను నిర్వర్తించగలమని లేఖలో పేర్కొన్నారు. అయితే ఈ కష్ట కాలంలో కేంద్రం తీసుకునే నిర్ణయం మాకు ధైర్యాన్ని, భరోసాను ఇస్తుందని, తమ చుట్టూ ఉన్న చీకటి నుంచి బయటపడే మార్గాన్ని చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు కేంద్రానికి రాసిన లేఖలో వెల్లడించారు.

## పోర్ట్ బ్లెయిర్ పేరును శ్రీ విజయ పురంగా మారుస్తాం

మొదటి పేజీ తరువాయి

నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సాధించిన విజయానికి శ్రీ విజయ పురం ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, చరిత్రలో అండమాన్ నికోబార్ దీవులకు ఎనలేని స్థానం ఉందని కేంద్ర హెూంమంత్రి అన్నారు. ఒకప్పుడు చోళ సామ్రాజ్యానికి నౌకాదళ స్థావరంగా పనిచేసిన ద్వీప భూభాగం నేడు మన వ్యూహాత్మక మరియు అభివృద్ధి ఆకాంక్షలకు కీలకమైన స్థావరంగా మారిందని ఆయన అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ తొలిసారిగా తిరంగాను ఆవిష్కరించిన ప్రదేశం ఇదేనని, వీర్ సావర్కర్, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు స్వతంత్ర దేశం కోసం పోరాడిన సెల్యులార్ జైలు కూడా ఇదేనని మంత్రి చెప్పారు.

# హైడ్రాను రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి

పరిధిలోని వ్యాపార అక్రమ నిర్మాణాలు కూల్చివేసింది. తుమ్మడి కుంట ఎన్ కన్వెన్షన్ తో పాటు అప్పా చెరువులోని అక్రమ నిర్మాణాలను సైతం కూల్చివేసింది.



కాగా.. దరాబాద్ మహానగరంలోని అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేస్తోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాల చిట్టాను ఒక్కొక్కటిగా విప్పుతూ అక్రమార్కుల గండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. ఏ రోజు, ఎప్పుడు హైడ్రా కూల్చివేతలు చేస్తుందో తెలియక కబ్జాదారుల్లో వణుకు పుడుతోంది. ఈ క్రమ్మలో కొందరు అయితే హైడ్రా నుంచి నోటీసులు అందక ముందే.. కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

నగర వ్యాప్తంగా ఇప్పటి వరకూ చేపట్టిన కూల్చివేతలపై తెలంగాణ ప్రభుత్వానికి హైడ్రా రిపోర్ట్ అందించింది. ఇప్పటి వరకూ 262 భవనాలు కూల్చివేసినట్టు లిస్ట్ రిలీజ్ చేసింది. 111 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. నంది నగర్, మన్సూరాబాద్, బంజారాహిల్స్, లోటస్‌పాండ్, బీజేఆర్‌నగర్, ఎమ్మెల్యే కాలనీ, అమీర్‌పేట్, గాజులరామారంలో పలు నిర్మాణాలకు నేలమట్టం చేసినట్లు హైడ్రా ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది.

## ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనం లేదు

మొదటి పేజీ తరువాయి

అన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ సిటీ పరిధిలో 15 వేలు, ఇతర జిల్లాల నుంచి మరో 3వేల మంది సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో 8 వేల మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారని వెల్లడించారు. మరోవైపు మిలాద్ ఉన్ నబీ కార్యక్రమం ఉందని మత పెద్దలతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా 17న పబ్లిక్ గార్డెన్‌లో ప్రజా పాలన దినోత్సవం కార్యక్రమం, పెరేడ్ గ్రౌండ్ లో ఇంకో ప్రోగ్రామ్ ఉందని సీపీ పేర్కొన్నారు. కాగా, హైదరాబాద్‌లో సెప్టెంబర్ 17న నిమజ్జనాల కార్యక్రమం జరుగనుంది

### భక్తులకు నియమ నిబంధనలు ఇవే

నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసులకు సహకరించాలని, ఆ రోజున కొన్ని నియమాలు పాటించాలని హైదరాబాద్ సిటీ పోలీసులు ఎక్స్ వేదికగా తెలిపారు. గణేష్ విగ్రహానికి ఒక వాహనానికి మాత్రమే అనుమతిస్తారు. సౌత్ జోన్ పరిమితుల నుంచి విగ్రహాలను తీసుకు వెళ్లే వాహనాలు ముందుగానే బయలుదేరాలి. ఏసీపీ కేటాయించిన నంబర్ వాహనంపై ఉండాలి. నిమజ్జనం కోసం విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్‌ను మర్చకూడదు. నిమజ్జనం రోజు వాహనాలపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌ను అనుమతించరు. రంగులు పిచికారీ చేయడానికి కాన్ఫెట్టీ గన్‌లను ఉపయోగించవద్దు. విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహనంలో మద్యం లేదా మరేదైనా మత్తు మందులు తాగిన వ్యక్తులను అనుమతించరు. రహదారిపై వెళ్లేటప్పుడు వాహనం ట్రాఫిక్‌ను ప్రభావితం చేయకూడదు. విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహనం ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా ఇతర వాహనాలకు లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే రహదారిపై ఆగకూడదు. ఊరేగింపులో ఎవరూ కర్రలు/ కత్తులు, మారణాయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు. ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చరాదు. జెండాలు లేదా అలంకరణల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల పొడవు మించకూడదు. వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్ బాటసారులపై వేయవద్దు. ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/ రెచ్చగొట్టే ప్రసంగాలు/ నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించరాదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఇతర రెచ్చగొట్టే చర్యలు చేయవద్దు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించండి. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, 100కి డయల్ చేసి తెలియాలి.

## గ్రామ పంచాయతీ ఎన్నికల దిశగా మరో ముందడుగు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల దిశగా మరో ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని పంచాయతీల వారిగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. గ్రామ పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌లలో ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం జరిగిందని, ఓటరు ముసాయిదా జాబితాపై శుక్రవారం నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ఎన్ని కల కమిషన్ తెలిపింది. 26వ తేదీన వాటిని పరిష్కరించనున్నట్లు ఎన్నికల కమిషన్ పేర్కొన్నది. ముసాయిదా ఓటర్ల జాబితాల సవరణపై ఈనెల 18 తేదీన జిల్లాస్థాయిలో, 19 తేదీన మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటుచేసి వారి సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు ప్రకటించింది. 28వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని కమిషన్ తన ప్రకటనలో వెల్లడించింది. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేసేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. తొలుత మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని ఇప్పటికే వెల్లడించింది. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డు పరిధిలో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓట్లు ఒకేచోట ఉండేలా జాబితాలను నిశితంగా పరిశీలించాలని సూచించింది. ఎన్నికల సంఘం సూచనల మేరకు అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు.

## కెబీఆర్‌పార్క్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్

### ఏర్పాటుకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం




హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కెబీఆర్‌పార్క్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ త్వరలో ఏర్పాటుకు చేయనున్నారు. దీనికోసం నవ నిర్మాణ్ అసోసియేట్స్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. జూబ్లీహిల్స్‌లోని ప్రజలు కెబీఆర్ పార్క్ వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలనుండి వస్తున్న డిమాండ్ తో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు జీహెచ్ ఎంసీ సిద్ధమవుతోంది.

### మల్టీ-లెవల్ పార్కింగ్‌లో సౌకర్యాలు

పార్కింగ్ సదుపాయం 405 చదరపు మీటర్లలో ఏర్పాటు చేస్తున్నారు. 72 కార్లను పార్కింగ్ చేసేందుకు కార్ స్పేస్‌లను (ECS) కలిగి ఉంటుంది. KBR పార్క్‌లోని మల్టీ-లెవల్ పార్కింగ్ సదుపాయంలో మొత్తం ఖాళీలలో 20 శాతం బైకులను కేటాయించనున్నారు. ఈ సదుపాయం డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ , ట్రాన్స్‌ఫర్ (DBFOT) మోడల్‌లో నిర్మించబడుతుంది.

### ఫెసిలిటీ వద్ద టిక్కెట్లు

ఈ సదుపాయం ఉదయం 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. పార్కింగ్ కోసం టికెట్టు ఉంటుంది.మెషీన్ల ద్వారా టికెట్లు ఇవ్వనున్నారు. స్మార్ట్ కార్డుల ద్వారా కూడా టికెట్ పంపిణీ ఉంటుంది. పార్కింగ్ సదుపాయాన్ని నావిగేట్ చేయడానికి, పార్కింగ్‌ను ముందుగానే బుక్ చేసుకోవడానికి, ఇతర సేవలను కోసం కస్టమర్లకు సహాయపడేందుకు మొబైల్ యాప్ ద్వారా అందించనున్నారు.

KBR పార్క్‌లో పార్కింగ్‌తో ఇబ్బందులు పడుతున్న హైదరాబాద్ వాసులకు కొత్త సౌకర్యం ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.

## వినాయక నవరాత్రులకు కానుకను అందించనున్న ప్రధాని

మొదటి పేజీ తరువాయి

పెట్టనుంది. అదే సమయంలో విశాఖపట్టణం, దుర్గ్ (ఛత్తీస్‌గఢ్) మధ్య మరో వందేభారత్ రైలు సేవలందించనుంది. ఈ రెండు రైళ్లను సెప్టెంబర్ 16న ప్రధానమంత్రి అహ్మదాబాద్ నుంచి ప్రారంభించనున్నారు. ఆ రోజు ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా 10 వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తారు. సామాన్యులు వందే భారత్ రైళ్లపై మక్కువ చూపుతుండటం, 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 100% కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉండటం కారణంగా కేంద్రప్రభుత్వం ఈ రైళ్లతో వీలైనన్ని ప్రాంతాలను అనుసంధానించేందుకు కృషిచేస్తోంది. సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్ రైలు నాగ్‌పూర్ నుండి ఉదయం 5:00 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 1:00 గంటలకు బయలుదేరి రాత్రి 8:20 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుంది. 578 కిలోమీటర్ల ప్రయాణాన్ని 7.15 గంటల్లో పూర్తి చేయనుంది. ఈ రైలు కాజీపేట, రామగుండం, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్ స్టేషన్లలో ఆగనుంది. నాగ్‌పూర్ నుంచి మొదలయ్యే రైలు సికింద్రాబాద్ చేరుకునే సందర్భంలో స్వాగతం పలకాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆహ్వానం పంపించారు. ఇందులో తెలంగాణలో రూ. 32,946 కోట్లతో రైల్వే సేవల అభివృద్ధికి చేస్తున్న కృషిని ఆయన ప్రస్తావించారు. ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.5,336 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రంలోని 40 స్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో ఆధునీకరిస్తున్నట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అటు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకోసం, విశాఖపట్టణం నుంచి ఛత్తీస్‌గఢ్ లోని దుర్గ్ ప్రాంతానికి వెళ్లనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాయ్‌పూర్, మహాసముంద్, ఖరియార్ రోడ్, కాంతబంజి, తిత్లాగఢ్, కేసింగా, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకోనుంది. ఈ సర్వీస్ మూడు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా) ప్రయాణికులకు సేవలందిస్తోంది.

## వాహనాల రద్దీ తగ్గించేందుకు సర్కార్ సరికొత్త ఆలోచన

మొదటి పేజీ తరువాయి

భారీగా పెరుగుతున్నది. ఈ క్రమంలోనే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించేందుకు వాహనాలు సాఫీగా సాగేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేస్తున్నది. శుక్రవారం హైదరాబాద్ సిటీలో ఫుట్ పాత్ ల అభివృద్ధి, క్లీనింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్ అంశాలపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. ట్రాఫిక్ స్ట్రీమ్ లైన్ చేయటంలో ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా ఉపయోగించుకునే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సూచించారు. హెూంగార్డ్స్ తరహాలో వారికి ఉపాధి అవకాశాలను కల్పించే అంశంపై పరిశీలన చేయాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ట్రాఫిక్ వాలంటీర్లుగా సేవలు అందించేందుకు ఆసక్తిగా ఉన్న ట్రాన్స్ జెండర్ల వివరాలు సేకరించాలని వారి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ఆర్ అండ్ బీ టెండర్లు పొంది పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దన్నారు సీఎం. ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారాయన. పనులు చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి పూర్తిస్థాయి రిపోర్ట్ 15రోజుల్లోగా అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తప్పుడు రిపోర్ట్ లు ఇస్తే అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్, బీజేపీలకు సవాల్ గా హర్యానా

కిందటిసారి 2019 అక్టోబరులో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజారిటీ రాలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 40 గెలుచుకుంది. దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్నాయక్ జనతా పార్టీకి 10 సీట్లు లభించాయి. దీంతో బిజెపి, జన్నాయక్ జనతా పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ తొలిసారి హర్యానా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బిజెపి, జెజెపి మధ్య విభేదాలు తలెత్తాయి. చాలా కాలం ఈ విభేదాలు నడిచాయి. అయితే చివరకు ఈ ఏడాది మార్చి నెలలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న విషయాన్ని బిజెపి అధిష్టానం గుర్తించింది. రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతోపాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బిజెపికి మైనస్‌గా మారాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి సవాల్‌గా మారాయి. దాదాపు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అగ్నిపథ్ పథకం, బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది. అగ్నిపథ్ మెరికల్లాంటి యువతకు సైన్యంలో కొలువులు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. అయితే సైన్యంలో కొలువు అంటే ఓ ఇరవై ఏళ్లో లేదా పాతికేళ్లో అని అందరూ భావిస్తారు. కనీసం పదిహేనేళ్లు అయినా ఉంటుందని ఆశిస్తారు. అయితే అగ్నిపథ్ పథకంలో కేంద్రం ఇచ్చే ఉద్యోగం కేవలం నాలుగేళ్లే ఉంటుంది. పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల మధ్య వయసులో ఉన్న యువకులు ఈ పథకానికి అర్హులు. విద్యార్హతలు కూడా పెద్దగా అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేదా పదో తరగతి పాసయితే చాలు. అగ్నిపథ్‌కు ఎంపికైన వాళ్లను వాళ్లవాళ్ల అర్హతలను బట్టి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇలా ఎందులోనైనా భర్తీ చేస్తారు. సర్వీస్ కేవలం నాలుగేళ్లే అయినా వేతనం మాత్రం ఆకట్టుకునేలా ఉంటుంది. మొదటి ఏడాది నెలకు ముప్పయి వేలు ఇస్తారు. రెండో ఏడాది ముప్పయి మూడు వేలు ఇస్తారు. మూడో ఏడాది అయితే ముప్పయి ఆరు వేల అయిదు వందల వేతనం ఉంటుంది. ఇక చివరగా నాలుగో ఏడాది నెలకు నలభై వేలు వేతనంగా ఇస్తారు. అగ్నిపథ్ పథకంలో భాగంగా సైన్యంలో కొలువులు చేసేవారిని అగ్నివీరులుగా పిలుస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌కు కార్పస్ ఫండ్ కింద కొంత అమౌంట్ కూడా జమ చేస్తారు. అయితే నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అగ్నివీరులు ఇంటికి పోవాల్సిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే అగ్నివీరులు నిరుత్సాహపడకుండా వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశ పెడుతున్నారు. ఇందు కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లేకపోవడం విశేషం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన అగ్నివీరులకు ఆ తరువాత ఎటువంటి పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతిమంగా సైన్యంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదు. భారత సైన్యంపై సిబ్బంది వేతనం, పెన్షన్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అగ్నిపథ్ పథకాన్ని రూపొందించింది కేంద్రం. హర్యానాలోని మెజారిటీ యువకులు స్కూల్ ఫైనల్ పాసవ్వగానే సైన్యంలోకి భర్తీ అవడానికి ప్రయత్నిస్తారు. ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులులాగే పెన్షన్ సౌకర్యానికి అర్హులవుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రారంభించిన అగ్నిపథ్ పథకంలో పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతేకాదు నాలుగేళ్ల సర్వీసు తరువాత మళ్లీ కొత్తగా ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. దీంతో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఇటీవల నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. ఇదిలా ఉంటే ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. కాగా ఈసారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశాలున్నాయి. దాదాపుగా అన్ని సీట్లలో బిజెపి, కాంగ్రెస్, జెజెపి మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశాలున్నాయి. ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌పైనే బిజెపి ప్రధానంగా ఆధారపడుతోంది. అంతేకాదు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం కూడా దానికి ప్లస్ పాయింట్‌గా మారింది. డబుల్ ఇంజన్ నినాదంతో దూసుకుపోవాలని బిజెపి భావిస్తోంది. అయితే బిజెపిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఏమేరకు తగ్గుముఖం పడుతుందన్నది వేచి చూడాల్సిందే.

# వామపక్షాల ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరికి విప్లవ జోహార్లు



ఆత్మకూరు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలో నిన్న మధ్యాహ్నం మూడు గంటలకు కామ్రేడ్ ఏచూరి ఢిల్లీ ఎయిమ్స్ లో అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఉద్యమంలో గత ఐదు దశాబ్దాలకు పైగా పేద ప్రజల రైతు కూలీల అభ్యున్నతి కోసం వాళ్ల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సిద్ధాంతకర్త కామ్రేడ్ ఏచూరి అని వామపక్ష పార్టీల ఐక్యత కోసం మరియు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధి మరియు ఆటుపోట్లపై ఎన్నో పుస్తకాలు రచించి కమ్యూనిస్టు ఉద్యమానికి అందించిన అపర మేధావి అని అగ్రవర్ణ కుటుంబంలో పుట్టినప్పటికీ భారతదేశంలోని అన్ని వర్గాల పేదల సామాజిక వర్గాల అభివృద్ధి కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని వక్తలు కొనియాడారు ఏచూరి గారు మరణించడం భారతదేశ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి వక్తలు కొనియాడారు ఈ సంతాప సభకు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ రాజు అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎండి మహమూద్ గారు సిపిఐ పార్టీ జిల్లా నాయకులు పి శ్రీహరి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ప్రసాద్ గారు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రాబర్ట్ గారు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు నరసింహ శెట్టి బాలకృష్ణ లక్ష్మీనారాయణ శెట్టి భారతీయుడు ఇస్మాయిల్ రాములు తదితరులు పాల్గొన్నారు

# అన్నదాన కార్యక్రమంను ప్రారంభించిన ఎస్సై బి.సురేష్

- అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది
- అన్నదాత మహంకాళి శ్రీనివాస్ ను అభినందించిన ఎస్సై



అమరచింత, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో శివపార్వతి గణేష్ నగర్ వద్ద గణేష్ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని బీసీ కాలనీలోని శివపార్వతి గణేష్ వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా అమరచింత మండలం ఎస్సై బి.సురేష్ ప్రారంభించి భక్తులకు అన్నం వడ్డించి, కాలనీలో ఉన్న యువతకు వినాయకుడి నిమజ్జన సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ కు, మందు,మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని వారు తెలియజేశారు. అన్నదానము మహాదానం. అన్నం పరబ్రహ్మ స్వరూపం అలాంటి అన్నదానానికి అన్నదాతగా ముందుకు వచ్చిన చేనేత వ్యాపారస్తులు,సిని నిర్మాత మహంకాళి శ్రీనివాసులుకి అభినందనలు



తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులకు, యువకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వినాయకుడు మండప నిర్వాహకులు,యువకులు ఎస్సై బి.సురేష్ ని ఆత్మీయంగా సన్మానించుకుని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మా వినాయకుడి మండపం దగ్గర అన్నదానం చేయాలనే కోరికను చెప్పిన వెంటనే అన్నదాతగా ముందుకు వచ్చిన ప్రముఖ సినీ నిర్మాత,జరీ చీరల వ్యాపారి, సామాజిక సేవకులు మహంకాళి శ్రీనివాసులు అన్నదానం ఏర్పాటు చేశారు వారికి, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన మన అమరచింత మండలం ఎస్సై బి.సురేష్ సార్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అని నిర్వహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివపార్వతి గణేష్ నగర్ నిర్వాహకులు, బీమ, సురేష్ మరియు కాలనీ యువకులు, పెద్దలు తదితరులుపాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి చేరిన గణపతి

- బైబై గణేషా అంటూ భక్తజనం వీడ్కోలు
- అంబరాన్నంటిన నిమజ్జన వేడుక



దేవరకద్ర, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఏడు రోజులు ఘనమైన పూజలందుకున్న గణపయ్యకు శుక్రవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం తీర్మాలయాపల్లి గ్రామంలో ఒకవైపు అదుర్స్ అనిపించే వినాయకడు జోష్‌ఫుల్ తో మరోవైపు టోటల్ తీర్మాలయాపల్లి గ్రామాన్ని తనవైపు తిప్పుకునే నిమజ్జన మహోత్సవం రంగు రంగుల కాగితాలు, పూలు దండాలతో, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో గణపతిని ఉంచి కన్నుల పండువగా శోభయాత్ర నిర్వహించారు. దారి పొడవునా భజనలు, బ్యాండు చప్పుళ్లు, నృత్యాల హోరుతో వైభవంగా సాగిన వినాయక నిమజ్జనంలో అడుగడుగునా గణపయ్యకు భక్తులు నీరాజనం పలికారు. జై గణపతతి జై జై గణపతి గణపతి బొప్ప మోరియా ఆదాలడ్డూ కాలియా అంటూభక్తులు, యువతీ యువకుల నినాదాలు మిన్నంటగా తీన్మార్ డ్యాన్సు లు, ప్రత్యేక డోల్,బ్యాండ్, డప్పుల చప్పుడ్లతో పాటుకోలాటం, చిన్నారుల కేరింతల నడుమ విఘ్నేశుడిని ప్రాజెక్టు బ్యాక్ వాటర్ డ్యామ్ వాగులలో నిమజ్జనం చేసి పోయిరా గణపయ్యా వెళ్లి రావయ్యా గణపయ్య మళ్లీ రావయ్య గణపయ్య అంటూ పార్వతీ తనయుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. చివరి రోజున లడ్డూ వేలం నిర్వహించి అధికంగా పాట పాడిన వారు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర యూత్ రామకృష్ణ అంజి రాజేష్ రవి అభిషేక్ శివ నరేంద్ర సంపత్ భరత్ నరేష్ శ్రీకాత్ రాకేష్ మోహన్ శెంకర్ అక్షయ్ గోవర్ధన్ మహేష్ ఐశ్వర్యం, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సీతారాం ఏచూరి విప్లవ జోహార్లు

- విప్లవ యోధుడు సీతారాం ఏచూరి ఘనమైన నివాళి



నేరేడుచర్ల, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు అఖిల భారత జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సితార ఏ చూరి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించడం జరిగినది. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభకు సిపిఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిపిఎం సిపిఐ నాయకులు కొదమగుండ్ల నగేష్ ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు మాట్లాడుతూ కామ్రేడ్ ఏచూరి గత నెల 19వ తారీఖున అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి ఢిల్లీలో మరణించారని ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని వారు అన్నారు

విద్యార్థి నాయకుడిగా ఎస్ఎఫ్ఐ లో పనిచేస్తూ జేఎన్టీయూలో ఎస్ఎఫ్ఐ ఉద్యమాన్ని నిర్మించిన గొప్ప నాయకుడు విద్యార్థి యువజన జాతీయ నాయకుడిగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా పొలిటి బ్యూరో సభ్యుడిగా ప్రస్తుతం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండి చనిపోవటం బాధాకరమని అన్నారు కామ్రేడ్ ఏచూరి ప్రపంచ కమ్యూనిస్టు మేధావిగా ఉత్తమ పార్లమెంటేరియన్ సభ్యునిగా ఉత్తమ రచయితగా ఉత్తమ కార్టునిస్టుగా ప్రపంచంలోనే ఒక గుర్తింపు పొందిన నాయకుడిగా ఎదిగారని వారు అన్నారు దేశంలో మత ఉన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించా రా నీఅన్నారు పార్లమెంటులో పెద్దల సభలో తమ వాని బానిని దేశంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు మాట్లాడారని అన్నారు కామ్రేడ్ ఏచూరి మరణం యావత్తు భారత కమ్యూనిస్టు శ్రేణులను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు కామ్రేడ్ సీతారాం ఆశయాలని ముందుకు తీసుకుపోయిన నాడే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించిన వాళ్ళం అవుతావని వారన్నారు ఈ సంతాప సభలో టిడిపి మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు, కుంకు తిరుపతయ్య ,నీల రామ్మూర్తి, కట్ట మధు, మామిడి నాగ సైదులు, ఆనెగంటి మీనయ్య, ఎడ్ల సైదులు ,టీ .శ్రీను అల్వాల శ్రీధర్ ,మచ్చ సోమయ్య బి శ్రీను సైదులు, సిపిఐ నాయకులు చిలకరాజు శ్రీను ,ఉదర వెంకన్న, పరికె భరత్ ,వివేక్, జయంత్, నక్క వెంకటేష్, సిపిఎం నాయకులు గుర్రం ఏసు, దిద్దగుంట్ల అమరారెడ్డి, సట్టు కోటయ్య, జొన్నలగడ్డ వెంకన్న, తాడోజు శ్రీను ,తదితరులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి**

నేరేడుచర్ల, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామపంచాయతీ ఆవాస గ్రామం తోకల వారి గూడెం గ్రామ వాస్తవ్యులు తోకల సైదమ్మ భర్త రాజయ్య సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు 32,500 ఈరోజు మండల కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, డైరెక్టర్లు మచ్చ శ్రీనివాస్, దేవులపల్లి శంకరాచారి మాజీ సర్పంచ్ చింతమల్లసైదులు, గజ్జల కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ,భారీ సోమయ్య, రేఖ సైదులు నవీన్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయం అందజేత



గరిడేపల్లి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండల కేంద్రంలోని పోనుగోడు గ్రామంలో ఇటీవల ఆరోగ్యంతో మృతి చెందిన గ్రామ గ్రంథాలయ ఇన్చార్జి నందిపాటి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను అంబేద్కర్ కమిటీ సభ్యులు పరామర్శించి 5000 రూపాయలు నగదు 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందజేశారు ఇందుకు సహకరించినటువంటి అంబేద్కర్ కమిటీ సభ్యులు అధ్యక్షులు నందిపాటి నరేష్, ఉపాధ్యక్షులు చిటికెల కిరణ్, కోశాధికారి లంకపల్లి రమేష్, ఒగ్గు మహేష్, చిలక మధు, పద్మ, శోభ, కలమ్మ తదితరులు పాల్గొన్నారు

# బొత్తలపాలెం గ్రామపంచాయతీలో ఓటరు జాబితా ప్రదర్శన



పాలకవీడు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం బొత్తలపాలెం గ్రామపంచాయతీ నందు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం గ్రామపంచాయతీ నందు వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా నోటీస్ బోర్డ్ నందు ప్రదర్శించనైనది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వి బాబు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోగు పిచ్చి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్దిక సహాయం



గరిడేపల్లి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామం కాలనీ చెందిన నందిపాటి వెంకటేశ్వర్లు అనారోగ్యం తో మరణించారు. వారి కుటుంబానికి జోగు పిచ్చి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10,000 వేల రూపాయల చెక్కును ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవింద్ రెడ్డి ఆ కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామంలోని అన్ని నిరుపేద కుటుంబాలకు జోగు పిచ్చి రెడ్డి ఫౌండేషన్ అండగా ఉంటూ ఆపదలో ఆదుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవింద్ రెడ్డి, అనంతు చంద్రయ్య, చిలక పిచ్చయ్య, కుర్రి వెంకన్న, సామ్రాట్,నాగేల్లి సైదులు పకీరా, వెంకటయ్య,కిరణ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు అల్వాల్ గ్రామంలో అన్నదాన కార్యక్రమం

వనపర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో గోపాలకృష్ణ యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన 16వ వార్షికోత్సవ వినయక చవితి ఉత్సవాలలో, గణేషుడికి ప్రతి రోజు ప్రత్యేక నైవేద్యాల తో పూజలు, నిర్వహించారు. నేటికీ 8 రోజులు కావస్తున్నాడంతో, శనివారం సాయంత్రం 6 గంటలకు యాదవ సంఘం కమిటీ యువకులు కలిసి అన్నదాన (అన్న ప్రసాద) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అందరూ పాల్గొని గణేషుడి ఆశీర్వాదాలు పొందాలని యాదవ కమిటీ యువకులు కోరారు.

# లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేయాలి

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి**



ఆత్మకూరు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని బాలకృష్ణాపూర్ గోపన్నపేట కరివేనా దేవరపల్లి గుంటుపల్లి ఆరేపల్లి రేచింతల తిప్పడంపల్లి పలు గ్రామాలలో జోరుగా భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమం కొనసాగుతుంది. ఇట్టి కార్యక్రమానికి నారాయణపేట జిల్లా కన్వీనర్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థగత పర్వం సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024 కార్యక్రమంలో లక్ష్యానికి మించి బిజెపి సభ్యత్వ నమోదు చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి బిజెపి సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కో కన్వీనర్ అశోక్ కుమార్ మండల కన్వీనర్ ఎల్లన్న, మరియు మండల కో కన్వీనర్, ఆంజనేయులు, వెంకటేష్,విష్ణు వర్ధన్ రెడ్డి (ఆత్మకూరు రూరల్ ప్రెసిడెంట్), మెర్వ రాజు (ఆత్మకూరు రూరల్ ఇంచార్జి ), కాంబాలాపురం రాము (బీజేపీ నాయకులు) జె. శ్రీనివాసులు, ఇట్టి కార్యక్రమంలో నాగరాజ్, బాలరాజ్, భరత్, నవీన్, మహేష్, రవి, నరేష్, జాను, దశరత్, బంగ్లా కురుమన్న, మండ్ల నాగరాజు, శివ రామ కృష్ణ, లక్ష్మణ, మాసన్న, నర్వ మండల నాయకులు,యాదవ రెడ్డి ,విజయ్ రామ్ మీసాల అశోక్ మరియు తదితరులు బీజేపీ గ్రామ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఉద్యాన కళాశాల ఆధ్వరంలో సేంద్రియ ఎరువులు పంపిణి

**కళాశాల అసోసియేట్ డాక్టర్ పిడిగం సైదయ్య**




వనపర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలంలోని మోజర్లలో, ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కింద 75 మంది షెడ్యూల్ కులాల రైతులకి మిరప, బెండ, వంగ కూరగాయల విత్తనాలు, సేంద్రియ ఎరువులు, సేంద్రియ పురుగుమందులు, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ, తక్కువ భూమి విస్తీర్ణం ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగు చేస్తే ఉపాధి సంవత్సరమంతా దొరకడంతో పాటు పెట్టిన పెట్టుబడికి వెంటనే రాబడి వస్తుందని పేర్కొన్నారు. ఉద్యాన పంటలు సాగుతో నష్టాలు చాలా తక్కువ అని చెప్పారు. రోజు రోజుకు పెరుగుతున్న కూరగాయల డిమాండ్తో భవిష్యత్తులో సైతం కూరగాయలకు మంచి ధర ఉంటుందని ఆయన తెలిపారు. హైదరాబాదులో నేటికీ కేవలం 60% కూరగాయలు మాత్రమే స్థానికంగా ఉత్పత్తి అవుతున్నాయని, హైదరాబాద్ చుట్టుపక్కల 100 కిలోమీటర్ల పరిధిలో కూరగాయలు పండించుకునేందుకు వీలుందని, తద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందవచ్చని డాక్టర్ సైదయ్య తెలిపారు. విత్తనాలు విత్తనాలు ఇతర ఇన్పుట్స్ తీసుకున్నారు రైతులు సలహాలు సందేహాలను అభివృద్ధి చేసుకునేందుకు కళాశాల శాస్త్రవేత్తలను ఎప్పుడైనా సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యాన రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉంటామని ర్కొన్నారు. రైతులకు 8200 విలువైన ఇన్పుట్ లు సరఫరా చేసినట్టు ఎస్సీ సబ్ ప్లాన్ ఇంచార్జ్ బేబీ రాణి చెప్పారు.

కార్యక్రమంలో జీవన ఎరువులు, సేంద్రియ పురుగుమందులపై డాక్టర్ షహనాజ్, కూరగాయల నర్సరీ పై డాక్టర్ శ్రీనివాస్ , ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పై చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో, కని మెట్ట, చిన్న మందడి, మోజెర్ల, మద్దిగట్ల, జయన్న తిరుమలాపూర్ షెడ్యూల్ కులాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్వాల్ నూతన గల్లిక గణేష్ కమిటీ లడ్డూ వేలం రూ. 61,500

**లడ్డు ప్రసాదనీ దక్కించుకున్న మాలపల్లి బ్రదర్స్**



వనపర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో యువత నూతనంగా ఏర్పాటు చేసుకున్న గల్లిక గణేష్ కమిటీ ఆద్యార్యంలో గత 5 రోజుల నుండి వినాయక చవితి ఉత్సవాలను ప్రత్యేక పూజలతో అంగరంగ వైభోగంగా నిర్వహించారు. బుధవారం అష్టమి ఉండటంతో ఐదు రోజుల వినాయకుడిగా గురువారం నాడు అల్వాల చెరువులో నిమజ్జనం చేయడం జరిగింది. గణేశుని ఆటల పాటలతో, భజన కీర్తనలతో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. గణేష్ ని లడ్డు ప్రసాద వేలంలో పోటా పోటీగా సాగిన తరువాత చివరిగా మాలపల్లి బ్రదర్స్ మాలపల్లి రవీందర్ రెడ్డి, కుమారులైన మాలపల్లి సునీల్ రెడ్డి, మాలపల్లి ప్రవీణ్ రెడ్డి ఐదు రోజులు ఘనంగా పూజలందుకున్న గణనాథునీ లడ్డుని 61,500 రూపాయలకు దక్కించుకున్నారు. అలాగే వినాయకుని యొక్క పంచా మరియు పండుని మోహన్ రెడ్డి కుమారుడు.లక్ష్మీకాంత్ రెడ్డి 25,000 రూపాయలకు దక్కించుకోవడం జరిగింది. మొదటిసారి పెట్టిన గల్లీ కా గణేష్ వినాయకునికి పూజలు చేసిన భక్తులకు పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు, అలాగే అన్నదానం చేసిన దాతలకు అలాగే ప్రతిరోజు రాత్రి లేట్ అయినా సరే ఇక్కడే ఉండి బొడ్డేమలు వేచిన ఆడపడుచులకు అలాగే

భజన కార్యక్రమంలో పాల్గొన్న వారికి గ్రామంలో జరిగిన పండగకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా గల్లి కా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పకృతి మానవాళికి సంపూర్ణ ఆయువు.. ప్రకృతిని రక్షిద్దాం

**♦ వనమహోత్సవం సందర్భంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ**



నేరేడుచర్ల, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మున్సిపాలిటీ లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 8 వవార్డు 11వ వార్డు ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ 8వ వార్డు కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత మొక్కల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది మానవుని మనుగడకు చెట్లు ఎంతో ఆధారపడతాయని మొక్కల సంరక్షణ వాటిని కాపాడడం ప్రతి ఒక్క పౌరుని బాధ్యతగా ఉండాలని ప్రతి ఇంటిలో మొక్కలు పెంచుకొనటం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యవంతమైనటువంటి జీవితాన్ని గడపగలమని వారు అన్నారు ప్రతి ఇంటిలో రోడ్డు వెంబడి మొక్కలు నాటి వాతావరణ కాలుష్యం పర్యావరణ పరిరక్షణ ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉన్నది అని వారుఅన్నారు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు ఈ పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ అశోక్ రెడ్డి క ఎస్.కె నజీర్ శివలక్ష్మి సైదులు ఎస్కే జానీ శ్రీను కొదమగుండ్ల నగేష్ రాంబాబు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహానేత నిష్క్రమనం బాధాకరం: సిపిఐ



అమరచింత, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి అత్యంత బాధాకరమని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె విజయ రాములు అన్నారు. శుక్రవారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ జెండా కట్ట వద్ద సిపిఐ నాయకులతో కలిసి ఆయన సీతారాం ఏచూరికి ఘన నివాళి అర్పించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా విజయరాములు మాట్లాడుతూ సీతారాం ఏచూరి రెండు తెలుగు రాష్ట్రాలకు సుపరిచితుడని అన్నారు. ఆయన విద్యాభ్యాసం మొత్తం హైదరాబాదులోనే కొనసాగిందన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయనకు విడదీయరాని బంధం ఉందని అన్నారు. ఎస్ఎఫ్ఐ లో కొనసాగుతూ ఢిల్లీకి వెళ్లి రాజకీయాల్లో చురుకుగా పాల్గొని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కోసం ఆయన పోరాటం నిర్వహించారని అన్నారు. ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టుల అందరూ ఆయన మరణ వార్త విని దిగ్భ్రాంతి చెందారని అన్నారు.సీతారాం ఏచూరి కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు ఆయన నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటం నిర్వహించారని అన్నారు. దేశ రాజకీయాలలో తనదైన పాత్ర పోషించి కమ్యూనిస్టు భావజావాలని దేశవ్యాప్తంగా వినిపించారని అన్నారు. ఆయన మరణం ఆ పార్టీకి తీరని లోటని ముఖ్యంగా దళిత, బహుజన, బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు తీరని లోటు అని అన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, నాయకులు శ్యాంసుందర్, రవీందర్, కుతుబ్, మల్లేష్, సౌలు, ఇజ్రాయిల్ తో పాటు పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



పెబ్బేరు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రంగాపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్ ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అంగన్వాడి కార్యకర్త పోస్టు గత మూడు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే భర్తీ చేస్తామని చెప్పారు. రంగాపూరు ఘాట్ వద్ద పోలీస్ పహారా పెట్టండి. వినాయక నిమజ్జనానికి రంగపూర్ ఘాట్ వద్దకు తీసుకువస్తే ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను, ఎంపీడీఓ ను ఆదేశించారు. పెబ్బేరు - వనపర్తి రహదారి విస్తరణ పనులు ప్రారంభించండన్నారు. పెబ్బేరు నుండి వనపర్తి వెళ్లే రహదారి విస్తరణ పనులు రోడ్డు పై నుండి విద్యుత్ స్తంభాలను పక్కకు జరపాల్సి ఉండటంతో విస్తరణ పనులు ఆగిపోయినట్లు మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పరిశీలించిన కలక్టర్ విద్యుత్ స్తంభాలు మార్చేందుకు అవసరమైన నిధులు మున్సిపాలిటీ నుండి సగం ఇవ్వాలని మిగిలిన సగం కలెక్టర్ ప్రత్యేక నిధుల నుండి ఇవ్వనున్నట్లు తెలిపారు. వారం లోపల రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం కావాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పెబ్బేరు మున్సిపాలిటీలో ఉన్న మహాత్మ జ్యోతి రావ్ పూలే బి.సి. బాలికల గురుకుల పాఠశాలను కలక్టర్ సందర్శించారు. ఆహార పదార్థాల రిజిస్టరు ను పరిశీలించిన కలక్టర్ స్టాక్ వచ్చినప్పుడు విద్యార్థుల మెస్ కమిటీ ద్వారా సంతకాలు విధిగా తీసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలకు 460 మంది విద్యార్థినిలు ఉన్నారని, డార్మెటరీ, తరగతి గదులు ఒకే చోట ఉండటం, సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, వర్షాకాలంలో గదులు వర్షపు నీటితో కురవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరో భవనంలోకి మార్చవలడిందిగా ప్రిన్సిపాల్ కలేక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలక్టర్ మంచి భవనం చూసి ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ నీ సూచించారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలి, పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలక్టర్ ఏ.ఎన్ సి., ఈ.డి.డి. రిజిస్టర్లను పరిశీలించారు. మొదటి త్రైమాసికంలో నమోదు చేసిన గర్భిణీలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ సమయానికి వైద్యం అందిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవం జరిపించే విధంగా చూడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకారం శుక్రవారం అన్ని పంచాయతీ కార్యాలయాల్లో, మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓటరు జాబితా ప్రకటించాల్సి ఉండగా జిల్లా కలెక్టర్ పెబ్బేరు ఎంపిడిఓ కార్యాలయంలో తనిఖీ చేశారు. జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నాయా అని పరిశీలించారు. పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఆది శేషు, మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ,పెబ్బేరు తహశీల్దార్ లక్ష్మీ,ఎంపీడీఓ రవీందర్, పంచాయతీ రాజ్ డిఈ శ్రీనివాసులు, ఏఈ కార్తీక్, డిప్యూటీ డి.యం అండ్ హెచ్ఓ డా. సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవలిక, మెడికల్ ఆఫీసర్,పాటశాల ఉపాధ్యాయులు తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.

# ప్రతి కార్యకర్త సభ్యత నమోదుకై కృషి చేయ్యాలి

**అశ్వని రాధా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు**



వనపర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): బిజెపి రాష్ట్ర పిలుపుమేరకు గురువారం, వనపర్తి జిల్లాలో, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధమ్మ మరియు, వనపర్తి జిల్లా బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు అర్చన ఆధ్వర్యంలో, వనపర్తి బస్టాండ్ లో ప్రయాణికులను కలిసి వారితో మాట్లాడి బిజెపిలో చేరండి-దేశ అభివృద్ధికి పాటుపడండి, నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని బలపరచండి అని చెప్పి బిజెపి సభ్యత కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అశ్వినీ రాధమ్మ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు భారతీయ జనతా పార్టీ పుంజుకుంటున్నంది. మండలంలోని బూతు స్థాయిల నుండి, జిల్లా నాయకుల స్థాయి వరకు ప్రతి ఒక్కరు బిజెపి పార్టీ బలోపేతానికి చేయ్యలని, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచి స్థానాలు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కావున ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో, ప్రతి జిల్లాలో, బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయ్యలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా బిజెపిలో చేరిన వారికి వారు అభినందనలు తెలియజేశారు.

# ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని నష్టం

**- పేదల పక్షాన దేశ స్థాయిలో గళం విప్పిన వ్యక్తి ఏచూరి**

**- సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాష్**



పాలకీడు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కమ్యూనిస్ట్ సీనియర్ నాయకుడు రాజ్యసభ మాజీ సభ్యుడు, సిపిఎం జనరల్ సెక్రటరీ, పొలిటి బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి మరణం బాధాకరం అని పాలకీడు మండలం సిపిఎం కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి తన జీవితాన్ని అంతా కమ్యూనిస్ట్ సిద్ధాంతాల కోసం దార పోసి, సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా,

ఆర్థిక అసమానతల పై పోరాడుతూ పేదల పక్షాన దేశస్థాయిలో గళం విప్పిన మహోన్నత వ్యక్తి ఏచూరి అని, ప్రజా సమస్యల కోసం తన జీవితాన్ని వామ పక్షాల తరఫున ప్రజా పోరాటం చేసిన ప్రజా పోరాట యోధుడిని కోల్పోవడం దేశానికి తీరని లోటు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మాజీ జెడ్పిటిసి ముష్యం నరసింహ పిఎసిఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్, మాజీ సర్పంచ్ గుర్రం ధనమూర్తి, సిపిఎం మండల నాయకులు దిద్దకుంట్ల పురుషోత్తం రెడ్డి,ఆర్లపూడి వీరభద్రం, ఎర్రెడ్ల మల్లారెడ్డి, నన్నెపంగ రమేష్ నాయకులు ఒంగాల వెంకటరెడ్డి పరిగి కృష్ణ మాతంగి విశాఖ సిఐటియు నాయకులు వేముల రామయ్య రజక సంఘం నాయకులు పొదిల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టలపై మండల అధ్యక్షులు ఆగ్రహం



వెంకటాపూర్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ప్రజా పాలన ముసుగులో రేవంత్ నియంత పాలన చేస్తున్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని అలాగే మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుపై మరియు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై నాయకులపై పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బిఅర్ఎస్ పార్టీ వెంకటాపూర్ రామప్ప మండలఅధ్యక్షులు లింగాల రమణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలంటే ముఖ్యమంత్రి వెన్నులో ఎందుకంత వణుకు దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను వదిలి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం సిగ్గుచేటని సీఎం కనుసన్నల్లో సాగుతున్న ఈ అక్రమ విధానాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని. నిర్బంధాలు అరెస్టులు ఆంక్షలు బిఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని అరెస్టులకు బెదిరేది లేదని అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజా క్షేత్రంలో గుణపాఠం తప్పదని అన్నారు.

# బీఆర్ఎస్ నేత బడే నాగజ్యోతిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు





ములుగు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గురువారం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై జరిగిన దాడికి ప్రతిఘటనంగా మాజీ మంత్రి హరీశ్ రావు పిలుపు మేరకు బడే నాగజ్యోతితో ములుగు నియోజకవర్గం టిఆర్ఎస్ శ్రేణులుతో కలిసి ధర్నాకు వెళ్లే క్రమంలో శుక్రవారం ఉదయం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బడి నాగజ్యోతిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న తప్పులను మరియు హామీల అమలు విషయంలో హరీష్ రావు మరియు పార్టీ నాయకులు నిలదీస్తే ఏం చేయాలో అర్థం కాని ప్రభుత్వం ప్రజల మధ్యలో ఓ సంవత్సరం కూడా పూర్తి చేసుకోక ముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ముట్టుకున్న విషయం తెలుసుకున్న రేవంత్ రెడ్డి ఈ విధంగా బిఆర్ఎస్ నాయకులును అరెస్ట్ చేయడం కరెక్ట్ కాదని వారన్నారు. ప్రజాస్వామ్యం పద్ధతిలో శాంతియుత పోరాటాలు చేస్తామని, ప్రజలకు వాస్తవ పరిస్థితులు అర్థం అయ్యావని అన్నారు. ప్రజా పాలన అంటే నిర్భంధాల పాలన అని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్గా ఇటీవలనే బిఆర్ఎస్ పార్టీలో గెలిచిన అరికపూడి గాంధీని కాంగ్రెస్ లో చేర్చుకొని పీఏసీ పదవి ఇవ్వడం విడ్డూరం అన్నారు. పాడి కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి కాంగ్రెస్ గుండాలు కౌశిక్ రెడ్డి పై అరికపూడి గాంధీతో కలిసి దాడి చేయడం హత్యాయత్నం చేయడం హేయమైన చర్య అన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న హరీష్ రావుని అరెస్టు చేసి సుమారు ఐదు గంటలకు పైన పోలీస్ స్టేషన్లో ఇబ్బందులకు గురిచేసి అధికారపక్షంలో ఉన్న వాళ్లకు మాత్రం పోలీస్ స్టేషన్లో కాఫీలు పోసి సాగనంపడం కాంగ్రెస్ పార్టీ విధానాన్ని తెలియజేస్తుందన్నారు

# శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనంకు ఏర్పాట్లు

**– సెప్టెంబర్ 17న ఘనంగా ప్రజాపాలన దినోత్సవం**

**– జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణేష్ నిమజ్జనం, ప్రజా పాలన దినోత్సవం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు రెవెన్యూ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహబూబాబాద్ పట్టణంలో నిజాం చెరువు, తొర్రూరులో పెద్ద చెరువు, మరిపడలో మాకుల చెరువు, డోర్నకల్ బతుకమ్మ చెరువు, అలాగే గ్రామపంచాయతీ పరిధిలో సూచించిన చెరువులలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు చేయడం జరిగిందని, శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్, సౌకర్యం, గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్ లను, సిద్ధం చేసుకోవాలన్నారు. గణేష్ మండపాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, విద్యుత్ ప్రమాదాలు, తదితర విషయాలపై స్థానిక గణేష్ ఉత్సవ కమిటీలు, పోలీస్ రెవెన్యూ మున్సిపల్ గ్రామపంచాయతీ సిబ్బందిలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఊరేగింపు జరిగే దారులను ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని చెరువుల వద్ద భారీ కేడ్స్, నిర్మించాలని, ట్రాఫిక్ రూట్ మ్యాపు ప్రకారం నిమజ్జనం నిర్వహించాలని సూచించారు. మండపాల వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనంపై ప్రత్యేక బృందాలను షిఫ్టులవారీగా నియమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సూచించబడిన చెరువులలో మాత్రమే నిమజ్జనం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో వాగులలో నిమజ్జనం చేయకూడదని సూచించారు.
సెప్టెంబర్ 17,ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ముఖ్య అతిథి చేత జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాలు ఎగరవేయాలని, ఆరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, వేడుకలకు వచ్చే అతిథులు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు పక్కా ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తొర్రూర్ ఆర్డీవో నరసింహారావు, ఎన్పీడీసీఎల్, జడ్పీ సీఈఓ నర్మదా, ఈఈ ఆర్ అండ్ బి, ఐ బి, భీమ్లా నాయక్, సమ్మిరెడ్డి, డిపిఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఎక్సైజ్ ఫైర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపర్డెంట్ మదన్ మోహన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



పరకాల, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఈనెల 16న జరగబోయే గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన పరకాల మున్సిపల్ చైర్మన్ శ్రీ సోదా అనిత రామకృష్ణ. వారు మాట్లాడుతూ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఈ ప్రాంతం వద్ద భారీ క్రేను ఏర్పాటు. లైటింగ్ ఏర్పాటు. భారీ కేడింగ్ ఏర్పాట్లు. శోభయాత్ర సందర్భంగా దారి వెంబడి లైటింగ్. త్రాగునీటి సౌకర్యం. పారిశుద్ధ్య పనులు. మరియు వాగు దగ్గర పిల్లలు గానీ, పెద్దలు గానిలోపలికి వెళ్లకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ కౌన్సిలర్స్ మడికొండ సంపత్ కుమార్, ఒంటేరు సారయ్య, నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, పసుల లావణ్య రమేష్, పంచగిరి జయ హరి, బండి రాణి సదానందం గౌడ్, ఏకు రాజు, మున్సిపల్ ఈఈ రోహిత్, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్, బిల్ కలెక్టర్ భాస్కర్, జవాన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక హిందీ భాష



ములుగు, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): భిన్నత్వంలో ఏకత్వానికి ప్రత్యేక హిందీ భాష అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ములుగు ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం పేర్కొన్నారు. సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ హిందీ దివాస్ ను పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ జాతీయ భాషగా హిందీకి దేశంలో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. భారత రాజ్యాంగ పరిషత్ సెప్టెంబర్ 14, 1949న హిందీని అధికార భాషగా గుర్తించిన సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ హిందీ దివాస్ ను ప్రతి సంవత్సరము నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద భాషగా హిందీ గుర్తించబడిందని, అదేవిధంగా అత్యంత వేగంగా విస్తరిస్తున్న భాష కూడా హిందీ అని యునెస్కో ప్రకటించింది. హిందీ భాషను అభ్యసించిన వారు ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు.కళాశాల హిందీ విభాగపతి డాక్టర్ పి. నాగమణి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ హిందీ ద్వారా విభిన్న రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.హిందీ ద్వారా జాతీయస్థాయి లో ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి. అందువలన ప్రతి ఒక్కరు హిందీ నేర్చుకోవడం, చదువుకోవడం అనేది అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించు కొని విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రధాన చేయడమైనది. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. బాలయ్య మాట్లాడుతూ త్రిభాషా సూత్రంలో అంతర్భాగంగా హిందీ తప్పనిసరి అని తెలిపారు. కళాశాల స్టాఫ్ సెక్రటరీ మరియు మరియు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె సోమన్న మాట్లాడుతూ హిందీ మన జాతీయ భాషని తెలిపారు. కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ భాస్కర్ మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తరాదివారు ముందుండడానికి వారికి హిందీపై ఉన్న పట్టు కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు యువ రష్మీ, రాబియా, బీబీ మరియు, కరిష్మా, అబ్దుల్ కరీం తదితరులు కళాశాల అర్థశాస్త్ర ఉపన్యాసకురాలు డి. రాధిక వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కే సరిత, బి. శిరీష, డి రాధిక, %శ్రీ%డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పి.విజిత, డాక్టర్ జయశంకర్, డాక్టర్ బి. జగదీష్, ఆర్ తేజో లత, టి, అనిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సఖీ కేంద్రం బాధితులకు ఆలంబనగా నిలవాలి


**♦ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సఖి కేంద్రం బాధితులుకు ఆలంబనగా నిలవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని సఖి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా సఖీ కార్యాలయం లో అన్ని గదులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సఖి కార్యాలయం లో కొనసాగుతున్న సేవలు, బాదితులు, కేసుల వివరాలు, బాదితులకు వసతి కల్పిన, కేసుల పరిష్కారం, పెండింగ్ లో ఉన్న కేసులు తదితర వివరాలను సఖి కేంద్ర నిర్వాహకురాలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సఖి సేవలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించి మొక్కలు నాటారు. సఖి కేంద్రం వెనకాల నిర్మాణంలోఉన్న చైల్డ్ హోమ్ భవనాన్ని తనిఖీ చేశారు. సఖి కేంద్రం భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలనికోరగా మంజూరు చేస్తామని తెలిపారు. సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలకు మెరుగైన సేవలు అందించాలని బాధితుల కేసుల పరిష్కారంలో చొరవ చూపి సత్వర న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. జిల్లాలో సఖి కేంద్రం ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సేవలను విస్తరించి బాధితులకు అండగా నిలవాలనిజిల్లా కలెక్టర్ సఖి కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అవంతి, సఖి కేంద్ర నిర్వాహకురాలు గాయత్రి, సోషల్ కౌన్సిలర్ మాధవి, అకౌంటెంట్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**■ జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఆవరణలో సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలు జరుగుతాయని, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని, సోమవారం మధ్యాహ్నం నాటికీ ఏర్పాట్లు పూర్తిచేసి సన్నద్ధం కావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్ల పై ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు విధిగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పోలీస్ గౌరవ వందన కార్యక్రమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెప్టెంబర్ 17న ఉదయం ముఖ్య అతిథి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ చేసి, తమ సందేశాన్ని అందజేస్తారని తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి జిల్లా అధికారులు, సిబ్బంది అంతా తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ఆర్డీఓ కె. సత్య పాల్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీ విధులపై అవగాహన కలిగి ఉండాలి

**♦ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**♦ గ్రామాల అభివృద్ధిలో ప్రత్యేక అధికారుల విధులు కీలకం**

**♦ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయితీ విధులపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి నియోజక వర్గ పరిధిలోని మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలతో గ్రామపంచాయితీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, చెట్లు పెంపకం, గ్రామ పంచాయితీలు అభివృద్ధి, వీధి దీపాలు, జనన మరణాల రిజిస్ట్రేషన్, ప్రజారోగ్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులకు పిపిటి ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశిత లక్ష్యాలను గ్రామాలలో క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారలదేనని అన్నారు. సర్పంచ్ ల మాదిరిగానే గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులకు అన్ని రకాల అధికారాలు కల్పించడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులకు గ్రామ పంచాయితీ విధులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి కచ్చితంగా గ్రామాలను పరిశీలించాలని అన్నారు. ప్రతి రోజు సాయంత్రం పంచాయితీ కార్యదర్శులతో మాట్లాడి గ్రామాల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల విధులు చాలా కీలకమైనవని సేవల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో అన్ని శాఖల సిబ్బందితో తరచూ సమీక్షలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. గ్రామాలలో కనీస అవసరాలైన విద్యుత్, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా రక్షణ చర్యలు, పెండింగ్ లో ఉన్న రోడ్లు, మురుగునీటి కాల్వల పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి ఉద్యోగులకు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేయాలని అన్నారు. ప్రత్యేక అధికారులకు గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి అని ఎవరైనా అవకతవకలకు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా ప్రత్యేక అధికారులు గ్రామాలను అభివృద్ధి చేయాలని అన్నారు. సర్పంచ్ ఎన్నికలు జరిగే వరకు పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహించాలని సీజనల్ వ్యాధులపై ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని అన్నారు. గణేష్ నిమజ్జనం, దసరా, సద్దుల బతుకమ్మ పండుగలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పంట నష్టం, వరద ప్రభావిత నష్టాలను అంచనాలు వేసి జిల్లా కలెక్టర్ కు నివేదిక అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, డిపిఓ నారాయణ రావు, మండల ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు, ఎంపిడిఒ లు గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బీఎస్యూ మండల నూతన కమిటీ ఎన్నిక



శాయంపేట,సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): శాయంపేట మండలంలో బీఎస్యూ బహుజన స్టూడెంట్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడిగా సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి భరత్, ఉపాధ్యక్షులుగా పత్తిపాక గ్రామానికి చెందిన పరకాల రాజకుమార్ ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్ తో పాటు 10 మందిని ఎన్నుకున్నట్టు బీఎస్యూ బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద సురేష్ ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయలేకపోయింది. పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రిమాండ్మెంట్స్ విడుదల చేయడంలో విఫలమైంది అన్నారు. కాలేజీ అండ్ స్కూల్ లలో అధిక ఫీజులు నియంత్రణ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నిర్ధారణ నియంత్రణకు కమిటీని అతి తొందరగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామా ఈ కంటిన్యూ ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్తీక్ సాయి నాగరాజు అరవిందు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

## - హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



కరీంనగర్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గతంలో ఇదే పద్ధతిలో విద్యార్థులను విస్మరించడంతో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపారని అన్నారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల పరిస్థితి అధ్వానంగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పరపు రోహిత్, జిల్లా కమిటీ సభ్యులు రాకేశ్, సందేశ్, సుధీర్, అక్షరు, సాత్విక్, హరీష్, కరణ్ సింగ్, అంజి, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థ మార్పుల దిశగా అడుగులు

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా జెట్ స్పీడ్‌తో వెళ్తోంది. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిపుణులు, విద్యావేత్తలతో చర్చలు జరుపుతోంది. ఇటీవలే విద్యా కమిషన్ ను కూడా ఏర్పాటు చేసింది. దానికి చైర్మన్ గా ఆకునూరి మురళిని నియమించింది. పలు సందర్భాల్లో కూడా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని విద్యా విధానంలో కీలక మార్పులు తీసుకొస్తామని చెప్పిన విషయం తెలిసిందే. తెలంగాణలో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో రాణించేలా మార్పులు తీసుకొస్తామన్నారు. అందుకు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణలో విద్యా వ్యవస్థపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ బుధవారం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్కతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకరావాల్సిన సంస్కరణలపై సబ్ కమిటీ ఈ సమావేశంలో తీవ్రంగా చర్చించింది. ఇటు కోచింగ్ సెంటర్ల నిర్వహణలోనూ పాటించాల్సిన మార్గదర్శకాలపై కూడా ఉపసంఘం చర్చించింది. కేంద్ర మార్గదర్శకాలు రాష్ట్రంలో అమలు కావట్లేదంటూ కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు అమలు చేయాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కోచింగ్ సెంటర్లలో కేంద్ర మార్గదర్శకాలను అమలు చేయాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు, నీట్, ఎంసెట్ లాంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చేటువంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేస్తాం. కోచింగ్ సెంటర్లపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో అభ్యర్థుల భద్రత, ఫీజుల భారంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయాం. ఇంజినీరింగ్, మెడిసిన్ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ నిర్వహిస్తున్న పలు కోచింగ్ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా జూనియర్ కాలేజీలను నడుపుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపై చర్యలు తీసుకుంటాం. ఇటు ప్రైవేట్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కాలేజీల ఫీజుల నిర్ధారణపై నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ స్కూల్స్ ను ప్రతిభా కేంద్రాలుగా తీర్చిదిద్దగలిగితే పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్‌ను వేర్వేరుగా నడపడం తో మానవ వనరుల వృథా అవుతోంది.. అందువల్ల ఈ రెండింటినీ విలీనం చేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించాం' అంటూ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# పది అంశాలపై పోరాటాలు...దిశగా అడుగులు

హైదరాబాద్: పది అంశాల అజెండాతో బీజేఎల్పీ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గొడెం నగేష్ హాజరయ్యారు. అలాగే, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్, రామారావు పటేల్, రాకేష్ రెడ్డి, దన్ పాల్ సూర్యనారాయణ గుప్త పాల్గొన్నారు. బీజేపీలో గ్రూప్ తగాదాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. సమావేశంలో కీలక విషయాలపై చర్చించినట్టు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ది అంశాల అజెండాతో సమావేశం నిర్వహించామని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు కొత్త రేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. విమోచన దినోత్సవం నిర్వహించాలని సీఎంకు లేఖ రాయాలని డిసైడ్ చేశామని, రుణమాఫీ కాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. అందరికీ రుణమాఫీ చేసి రైతు భరోసా అమలు చేయాలని చెప్పారు. రైతు సమస్యలపై ఈ నెల 20న దీక్ష చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం వరద సహాయంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రుల మధ్య సఖ్యత లేదని, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే బీజేపీ మెంబర్షిప్ డ్రైవ్‌పై చర్చించామని, ఎండోమెంట్ భూములు తిరిగి అప్పజెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని తెలిపారు. వక్ఫ్ బోర్డు బిల్లుపై తప్పుడు ప్రచారం చేస్తున్న దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు ఏలేటి. బీజేఎల్పీ సమావేశం సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ, 2003 గుజరాత్‌లో మోదీ ముఖ్యమంత్రిగా డీమాల్యూషన్ డ్రైవ్ జరిగిందన్నారు. అక్కడ ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లి అమలు చేశారని గుర్తు చేశారు. కులం, మతం, ఉన్నోడు, లేనోడు అని లెక్కలు వేయకుండా నిర్వహించారన్నారు. ఆ డ్రైవ్‌తో గుజరాత్‌లో మోదీ సక్సెస్ అయ్యారని, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారని వివరించారు. అయితే, తెలంగాణలో హైడ్రా ప్రణాళిక ఎంటి? ముఖ్యమంత్రి ఏం చేయాలని అనుకుంటున్నారని అడిగారు అరవింద్. పాతబస్తీకి వెళ్లడానికి ప్యాంట్లు తడుస్తున్నాయా, రెండు రోజులకు ఒకసారి హైడ్రా పద్ధతులు మారుతున్నాయని మండిపడ్డారు. సెలెక్టెడ్ కాదు, సెక్యులర్ పద్ధతిగా ముందుకు వెళ్లాలని సూచించారు. చెరువులు కాపాడటం తప్పు కాదు కానీ, హుస్సేన్ సాగర్ నలు వైపులా నిర్మాణాలు ఉన్నాయి వాటిని కూడా కూలుస్తారా? అని ప్రశ్నించారు.

# వరదల మధ్య గర్భిణికి ప్రసవం..

## హెలికాప్టర్ ద్వారా రక్తం రవాణా

ముంబాయి: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భామ్రగఢ్ తహసీల్లో పరిస్థితి ఘోరంగా తయారైంది. వర్షాల వల్ల అనేక రోడ్లు మూసుకుపోయాయి. ఆ ప్రాంతంతో సంబంధాలు తెగిపోయాయి. అయితే అక్కడ ఓ గర్భిణీ పరిస్థితి విషమంగా మారింది. ఆమెకు అత్యవరంగా రక్తం అవసరం పడింది. దాంతో అధికారులు మహిళ ప్రాణాలను కాపాడేందుకు హెలికాప్టర్లో రక్తాన్ని అందించారు. ఈ ఘటన గడ్చిరోలిలోని భామ్రాగఢ్ తహసీల్ లో చోటు చేసుకుంది. ఇక్కడ వరదల నుంచి బయటకు వచ్చిన ఓ గర్భిణికి వైద్య బృందం ప్రసవం చేసింది. ఒక యూనిట్ రక్తాన్ని ఎక్కించిన తర్వాత, ఆమెకు ఒక బ్యాగ్ ఎక్కువ రక్తం అవసరమైంది. కానీ., వరద కారణంగా రోడ్లన్నీ మూసుకుపోయాయి. ఆ పరిస్థితిలో వర్షం ఆగిన తరువాత ఉదయం హెలికాప్టర్ ద్వారా రక్తాన్ని పంపిణీ చేశారు. మంటోషి గజేంద్ర చౌదరి అనే మహిళ ప్రసవ వేదనతో భమ్రాగఢ్ లోని గ్రామీణ ఆసుపత్రిలో చేరింది. ఇక్కడ వైద్యులు డెలివరీ నిర్వహించారు. ఆ తర్వాత ఆమెకు రక్తం అవసరమైంది. మహిళకు రక్తపు సంచి దొరికినా అది సరిపోలేదు. దాంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. వర్షం, వరదల కారణంగా బయటి నుంచి ప్రయాణించే అవకాశం లేదు. ఇక్కడ వరదల కారణంగా చాలా గ్రామాలతో కనెక్టివిటీ పోయింది. పారల్కోట నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మొత్తం విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

ఆ తర్వాత హెలికాప్టర్లో రక్తాన్ని తీసుకునేందుకు సన్నాహాలు చేయగా, ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ద్వారా రక్తం తీసుకురావడం కష్టంగా మారింది. చివరకు వాతావరణం అనుకూలించడంతో ఆరోగ్య కార్యకర్తలు గడ్చిరోలి నుంచి రక్తం తీసుకుని భామ్రాగఢ్కు బయలుదేరారు. ఇందుకోసం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నీలోత్పాల్ జిల్లా పోలీసు బలగాల హెలికాప్టర్ను అందుబాటులో ఉంచారు. వరద బీభత్సం మధ్య సత్వరం స్పందించిన వైద్య బృందం రక్తంతో వచ్చి మహిళ ప్రాణాలను కాపాడింది.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజుపై క్లారిటీ ఇవ్వాలి

## ఎన్.హెచ్.ఎం ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షులు కవ్వ లక్ష్మారెడ్డి

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం 1271 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ వేసిందని నోటిఫికేషన్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజుపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని తెలంగాణ ఎన్.హెచ్.ఎం ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షులు కవ్వ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం నోటిఫికేషన్ వేసినందుకు లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల పట్టణంలో గురువారం ఆయన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి చెప్పిన విధంగా.... నోటిఫికేషన్ లో చాలా అవకతవకలు ఉన్నాయని, ముఖ్యంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వడంపై ఖచ్చితమైన క్లారిటీ లేదని చెబుతూ ఏజెన్సీల ద్వారా ఇష్టానుసారంగా సర్వీస్ సర్టిఫికెట్స్ ఉద్యోగులు తెచ్చుకుంటారని విమర్శించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రభుత్వ అధికారుల వద్ద ఎక్స్పీరియన్స్ సర్టిఫికేట్ తీసుకువస్తున్నారని, ఇలా ఏజెన్సీల ద్వారా తేవడం వల్ల గత 25 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ లో పనిచేస్తున్న ఉద్యోగులము చాలా నష్టపోతామని ఆయన వాపోయారు. గత ప్రభుత్వంఏఎన్ఎం లకు సంబంధించిన నోటిఫికేషన్ లో వెయిటేజ్ మార్కులు 30 మార్కులు ఇవ్వగా దానికి సమాన క్యాడర్ అయిన ల్యాబ్ టెక్నీషియన్ల నోటిఫికేషన్ లో మాత్రం 20 మార్కులు వేయడం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నోటిఫికేషన్లు పరిశీలించి వెయిటేజ్ ఇవ్వాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే నోటిఫికేషన్ పై కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# బాత్రూంలో పిల్లలు బట్టలేకుండా ఉండగా వీడియోలు!

కరీంనగర్: తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పాఠశాలలో వరుసగా ఏదో ఒక రకమైన సంఘటనలు జరుగుతూనే వస్తున్నాయి. ఇటీవల జగిత్యాల జిల్లాలో పాముకాటుకు గురైన విద్యార్థి ఘటన మరువకముందే పెద్దపెల్లి జిల్లాలో మరొక పాముకాటు ఘటన చోటుచేసుకుంది పెద్దపెల్లి జిల్లాలో సుల్తానాబాద్ మండలం గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని పాముకాటు వేయడంతో పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న ఘటన చోటుచేసుకుంది. ఇలా అనేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్న నేపథ్యంలో సిరిసిల్ల జిల్లాలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో మరొక సమస్య వెలుగులోకి వచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. నెలసరి ఉన్న సమయంలో, విద్యార్థినులు బాత్రూంలో స్నానం చేస్తున్న సమయంలో జోత్స్న అనే టీచర్ లేట్ ఎందుకు అవుతుందని డోర్ పగలగొట్టి లోనికి వచ్చి తన ఫోన్ తో వీడియో రికార్డు చేస్తూ తమని కొడుతుందని ఆందోళనకు దిగారు. పీటి టీచర్ ను సస్పెండ్ చేయాలని ట్రైబల్ సోషల్ వెల్ఫేర్ విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు. 500 పైగా విద్యార్థినులకు రెండు బాత్రూంలో ఉండటం చాలా ఇబ్బంది కరంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. పీటి జ్యోత్స్న విద్యార్థినులను పెట్టే ఇబ్బందులు భరించలేక సిరిసిల్ల – సిద్దిపేట ప్రధాన రహదారి పై ధర్నాకు దిగినట్లు బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలు తెలిపారు. తాము బాత్రూంలో స్నానం చేస్తున్న సమయంలో లోపలికి వచ్చి బట్టలు లేకుండా వీడియోలు తీస్తూ బూతులు తిడుతూ, కొడుతూ తీసుకెళ్తుందని విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలో పార్ట్ టైం జాబ్ చేస్తున్న పిటీ జోత్స్న ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక కొట్టిన దెబ్బలని చూపిస్తూ రోదిస్తున్నారు.

సైకో టీచర్ ని సస్పెండ్ చేయాలంటూ రోదిస్తున్నారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మండల ఎంఈఓ రఘుపతి, పోలీసులు జ్యోత్స టీచర్ ను విధుల నుండి తప్పిస్తున్నామని ప్రకటించారు. డీఈఓ హామీతో ఇవ్వడంతోనే ఆమెను టీచర్ బాధ్యతల నుంచి తొలగించినట్లు వారు తెలిపారు. ఆ తర్వాతే ఆందోళన విరమించుకున్నారు విద్యార్థినులు.

# ఫ్రస్టేషన్ లో ట్రంప్... స్మైల్ తో కమలా...

న్యూయార్క్: తో ఊగిపోతే.. భారతీయ మూలాలున్న వైస్ ప్రెసిడెంట్ కమలాహారిస్ మాత్రం చిరునవ్వుతోనే డిబెట్‌తో పాటు అమెరికన్ల హృదయాలనూ గెలుచుకున్నారు. ఈ డిబెట్‌పై ఇండిపెండెంట్ సంస్థ యూగోవ్ ద్వారా పోల్ నిర్వహించిన అపోల్.. అత్యధిక అమెరికన్లకు డిబెట్‌లో హారిస్ సమయస్ఫూర్తి, ఆమె విధానాలు ఆకట్టుకున్నట్లు తేలింది. దాదాపు 63 శాతం మంది డిబెట్ వ్యూవర్స్ కమలకు జై కొడితే కేవలం 37 శాతం మంది మాత్రమే ట్రంప్‌నకు మద్దతు తెలిపారు. న్యూయార్క్ టైమ్స్ , సీనా కాలేజ్ సంయుక్తంగా నిర్వ హించిన సర్వేలో ఇద్దరికీ నెక్ టూ నెక్ ఫైట్ జరిగినట్లు వీవర్స్ అభిప్రాయపడినట్లు తేలింది. ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో రిపబ్లికన్ ప్రెసిడెన్షియల్ క్యాండిడేట్ అయిన డొనాల్డ్ ట్రంప్ అంతగా పరఫార్మ్ చేయలేదని ఆయన మద్దతుదారులే పేర్కొన్నారు. ఆయన మద్దతుదారుల్లో దాదాపు 69 శాతం మంది మాత్రమే ట్రంప్ డిబెట్ పట్ల సంతృప్తి వ్యక్తం చేయగా.. హారిస్ మద్దతుదారుల్లో మాత్రం 96 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. జూన్‌లో డెమోక్రాట్లకు నాటి ప్రెసిడెన్షియల్ క్యాండిడేట్‌గా ఉన్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌ని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అవుట్ ఫెర్మామ్ చేయగా.. ఈ డిబెట్‌లో వైస్ ప్రెసిడెంట్ కమలాహారిస్ సరిగ్గా బదులిచ్చారంటూ ఆమె సపోర్టర్స్ చెబుతున్నారు. ట్రంప్ మాత్రం డిబెట్ ముగిసిన తర్వాత ఇదో అద్భుతమైన డిబేట్‌గా పేర్కొంటూ ప్రకటన చేశారు. ఈ పోల్స్ మాత్రం డిబెట్‌పై వీవర్స్ అభిప్రాయాలను మాత్రమే తెలియ చేయనుండగా.. అవి ఓట్లుగా మారాల్సి ఉంది. ఈ డిబెట్ చూసిన పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్ .. హారిస్‌కు తన మద్దతు తెలిపారు. ఈ డిబేట్‌లో ఎవరు గెలిచారన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ట్రంప్ వీక్‌నెస్‌ను పట్టుకొని హారిస్ విజయవంతంగా తన వ్యూహాన్ని అమలు చేశారు తప్ప తన పాలసీలు ఏంటన్నది పూర్తిగా వివరించలేక పోయారని కొందరు అనలిస్టులు అభిప్రాయపడ్డారు. ట్రంప్ తన సమయాన్ని ఎక్కువగా ఇమ్మిగ్రెంట్స్ సహా నేషనల్ అబార్షన్ పాలసీ మాత్రమే కేంద్రీకరించడం కూడా హారిస్‌కు కలిసి వచ్చిన అంశంగా పేర్కొన్నారు. జో బైడెన్ విఫలమైన టారిఫ్ ఇష్యూలోకి హారిస్‌ను లాగిన ట్రంప్.. దానిని సమర్థంగా కొనసాగించి ఉంటే డిబెట్ మరోలా ఉండేదని అనలిస్టులు అంటున్నారు. ఇలా ట్రంప్ చేసిన స్వయంకృతాపరాధాలు హారిస్‌కు వరంగా మారాయని తాను సులువుగా డిబేట్ చేసేందుకు అవకాశం ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. ఈ డిబేట్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన వారు తమ అభిప్రాయాలను తెలిపారు.

అందులో 44 శాతం మంది తమ సమస్యల పట్ల హారిస్‌కు అవగాహన ఉందని తెలపగా.. 40 శాతం మంది ట్రంప్ తమ సమస్యలు తీర్చగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇమ్మిగ్రెంట్స్ అంశంలో కమాండ్ ఇన్ ఛీఫ్ మాదిరిగా ట్రంప్ ముందుండి సమస్యను పరిష్కరించగలరని అమెరికన్లు 23 అడ్వాంటేజ్ పాయింట్లు ఇవ్వగా.. ప్రజాస్వామ్యాన్ని సంరక్షించడంలో కమలా ముందుంటారంటూ ఆమెకు ఈ విషయంలో 9 అడ్వాంటేజ్ పాయింట్లు ఇచ్చారు. వీరి ఇరువురి మధ్య మరో డిబెట్ అక్టోబర్‌లో ఉంటుందని కొందరు పేర్కొంటుండగా మంగళవారం జరిగినదే మొదటిది చివరిది అయ్యే అవకాశం ఉందని పొలిటికల్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ట్రంప్‌పై హారిస్ ఇలానే తన ఆధిపత్యాన్ని ఓట్లుగా మలుచుకోగలిగితే అమెరికా తొలి మహిళా అధ్యక్షురాలుగా మన భారత మూలాలున్న ఆమె బాధ్యతలు చేపట్టడం అంత కష్టమేమీ కాదని పొలిటికల్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

# రామచంద్ర పిళ్లైకి బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో సుదీర్ఘంగా జైల్లో ఉన్న వారికి బెయిల్స్ లభిస్తున్నాయి. ఇటీవల మనీష్ సిసోడియాతో పాటు కల్వకుంట్ల కవితకు బెయిల్ లభించింది. తాజాగా రామచంద్రన్ పిళ్లైకి కూడా ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. రామచంద్రన్ పిళ్లై గత ఏడాది మార్చి నుంచి ఢిల్లీ జైల్లో ఉన్నారు. ఆయనను కవిత బినామీగా సీబీఐ చెబుతోంది. ఓ సారి అప్రూవర్ గా మారి స్టేట్ మెంట్ ఇచ్చారు. తర్వాత ఉపసంహరించుకుంటానని కోర్టులో పిటిషన్ వేశారు. ఈ గందరగోళం మధ్య ఆయన జైల్లోనే ఉండిపోయారు. తాజాగా ఆయన దాఖలు చేసుకున్న పిటిషన్ ను ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపి బెయిల్ మంజూరు చేసింది. సౌత్ లాబీలో రామచంద్రన్ పిళ్లై కిలక వ్యక్తి అని సీబీఐ, ఈడీ అభియోగాలు నమోదు చేసింది. పిళ్లై ఇండోస్పిరిట్ లిక్కర్ కంపెనీ ఎండీ సమీర్ మహేంద్రు నుంచి లంచాలు స్వీకరించారని.... ఆ లంచాలను ఈ కేసులో ఇతర నిందితులకు అందించాడని చార్జిషీటులో సీబీఐ పేర్కొన్నది. విచారణ సమయంలో పిళ్లై తప్పుడు వాంగ్మూలం ఇచ్చాడని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. సాక్ష్యాలను నాశనం చేయడంలో అతడి పాత్ర కూడా ఉందని ఈడీ కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఇదే కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌కు కూడా రెండు రోజుల కిందటే బెయిల్ లభించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో దాదాపుగా అందరికీ బెయిల్ వచ్చింది. కేజ్రీవాల్ మాత్రమే జైల్లో ఉన్నారు. ఆయన దాకలు చేసుకున్న పిటిషన్ పై సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. త్వరలో ఈ పిటిషన్ పై తీర్పు రాను?ంది. అయితే ఇది కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ కాదు. తన అరెస్టు అక్రమం అని ఆయన దాఖలు చేసుకున్న పిటిషన్. మరో వైపు బెయిల్ పిటిషన్లపై కూడా విచారణ జరుగుతున్నాయి. అందరికీ బెయిల్ వస్తున్నందున.. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కాంలో చార్జిషీట్లు దాఖలు చేసి.. దర్యాప్తు పూర్తయిందని సీబీఐ, ఈడీ కోర్టులకు తెలిపినందున మిగిలిన వారికి కూడా బెయిల్స్ వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇతర నిందితులకు బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కూడా బెయిల్ వచ్చే అవకాశాలను సూచిస్తున్నాయని అంటున్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అయినప్పటికీ ఆయన పదవికి రాజీనామా చేయలేదు. మంత్రులే పాలనను నిర్వహిస్తున్నారు. కేజ్రీవాల్ సీఎం హోదాలోనే జైల్లో ఉంటున్నారు. ఆయనతో రాజీనామా చేయించాలని కొందరు కోర్టుల్లో పిటిషన్లు వేశారు. కానీ కోర్టులు ఆయా పిటిషన్లు కొట్టి వేశాయి. జైలు నుంచే విధులు నిర్వహిస్తున్న సీఎంగా కేజ్రీవాల్ రికార్డు సృష్టించారు. ఇప్పటికే ఈడీ కేసులో బెయిల్ వచ్చింది..కానీ సీబీఐ కేసులో మాత్రం రాలేదు.

# కొలిక్కి రాని చర్చలు

## కొనసాగుతున్న డాక్టర్ల సమ్మె

కోల్ కత్తా: కోల్కతా డాక్టర్పై అత్యాచారం, హత్య పై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది.. అయితే.. నెల రోజులు దాటినా కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో పరిస్థితులు కుదటపడటం లేదు. నిరసనకు దిగిన జూనియర్ డాక్టర్లు సుప్రీంకోర్టు చెప్పినా విధుల్లోకి చేరడం లేదు. చర్చలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తే దానికి వారి కొన్ని షరతులు విధించారు. నిన్న సాయంత్రం చర్చలకు బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జూనియర్ డాక్టర్లను ఆహ్వానించారు. ఈమెయిల్ ద్వారా వారికి చర్చలకు ఆహ్వానం పంపారు. అయితే ఈ చర్చల్లో సీఎం మమతా బెనర్జీ సమక్షంలో జరగాలని, ఆ చర్చలను లైవ్ టెలికాస్ట్ చేయాలని జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాన్ని కోరారు. అంతే కాదు బెంగాల్‌లోని వివిధ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు చెందిన కనీసం 30 మంది ప్రతినిధులను ఈ చర్చల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని జూనియర్ డాక్టర్లు కోరారు. డాక్టర్ల షరతులను బెంగాల్ సర్కారు తిరస్కరించింది. స్వేచ్ఛగా చర్చలు నిర్వహించేందుకు తాము సిద్ధమని, కాని ముందస్తు షరతులు పెడితే సుహృద్భావ వాతావరణం ఉండదని బెంగాల్ ప్రభుత్వం ప్రకటించింది. అదే సమయంలో కొంత మంది ఎంఏ నేతలు జూనియర్ డాక్టర్ల తీరును తప్పుబట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించని జూనియర్ డాక్టర్లు దేశ వ్యతిరేకులను విమర్శించారు. న్యాయం కావాలన్న డిమాండ్ సహేతుకమైనదే అంటునే ముందు సీబీఐ విచారణ పూర్తి కావాలని ఎంఏ నేతలంటున్నారు. మరో వైపు ఆగస్టు తొమ్మిదిన చనిపోయిన డాక్టరుకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కోల్‌కతాలో నిరసనలు కొనసాగిస్తూనే ఉంది. వైద్య విద్యార్థికి న్యాయం జరిగేంత వరకు తమ నిరసనలు ఆపబోమని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఈ ప్రతిష్ఠంభనను తొలగించేందుకు బెంగాల్ సర్కారు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. నిరసనకు దిగిన డాక్టర్లపై కఠిన చర్య తీసుకునే ఆలోచనేది లేదని బెంగాల్ సర్కారు సంకేతాలు పంపింది. అదే సమయంలో జూనియర్ డాక్టర్ల తిరస్కార ధోరణిని సుప్రీంకోర్టుకు నివేదించనుంది. దానిపై సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందానే దాన్ని బట్టు ముందడుగు వేయాలనే ఆలోచనలో బెంగాల్ సర్కారు ఉంది.

ఆర్‌జీ కర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ తండ్రి ఇంట్లో ఈడీ సోదాలు కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగా కోల్‌కతాలోని సందీప్ ఘోష్‌కు చెందిన రెండు నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇందులో ఒక ఇంట్లో ఆయన తండ్రి సత్యప్రకాశ్ ఘోష్ ఉంటున్నారు. ఆ ఇంటి పరిస్థితి చూస్తుంటే అందులో ఎవరూ ఉంటున్నట్టు కనిపించడం లేదు. ఆర్‌జీ కర్ ఆస్పత్రికి వైద్యపరికరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ నివాసంలోనూ ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

# జోరుగా రేషన్ బియ్యం దందా

కరీంనగర్: వరంగల్ కమిషనరేట్ పరిధిలో పీడీఎస్ రైస్ దందా జోరుగా నడుస్తోంది. రేషన్ షాపులతో పాటు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేయడం, ఆ తరువాత ఎక్కువ రేటుతో ఇతర రాష్ట్రాలు, కోళ్ల ఫారాలకు తరలిస్తూ కొంతమంది దొడ్డిదారిన బిజినెస్ నడిపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ దందా ఎక్కువ కావడంతో వరంగల్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ అక్రమ దందా స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి రూ.13 లక్షల 41 వేల విలువైన 516 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రాంతంలో కొంతమంది పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా అక్రమ దందా చేసే వారికి వర్ధన్నపేట శివారులోని మహేశ్వరి రైస్ మిల్ అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. వరంగల్ పోలీసులకు సమాచారం అందగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి, వాహనాల్లో మహేశ్వరి మిల్కు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వర్ధన్నపేట పోలీసుల సహాయంతో టాస్క్ ఫోర్స్ ఆఫీసర్లు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న టీఎస్ 30 టీఏ1851 మహీంద్రా మినీ వాహనాన్ని పట్టుకోగా.. దాని డ్రైవర్ బాలు అనే యువకుడు పోలీసులు కండ్లు గప్పి పారిపోయాడు. అనంతరం మహేశ్వరి రైస్ మిల్లు ఓనర్ కొత్త రాజును అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత మిల్లును సోదా చెయ్యగా సుమారు 12 లక్షల 48 వేల విలువ గల 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. దీంతో బియ్యాన్ని సీజ్ చేసి, నిందితుడిని విచారణ నిమిత్తం వర్ధన్నపేట పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కమిషనరేట్ వెస్ట్ జోన్ పరిధి అయిన జనగామలో బియ్యం దందా అడ్డూఆపు లేకుండా నడుస్తోందనే ఆరోపణలున్నాయి. జనగామ మార్కెట్ ప్రాంతానికి చెందిన రోకళ్ల నాగులు అనే వ్యక్తి రేషన్ బియ్యం దందా చేస్తున్నట్టుగా టాస్క్ ఫోర్స్ పోలీసులు అందగా.. బుధవారం ఉదయం ఆయన ఇంటిపై రైడ్ చేశారు. అక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచగా.. టాస్క్ ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ స్టోర్ చేసి ఉన్న దాదాపు రూ.93 వేల 600 విలువైన 36 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

# కేసీఆర్ సైలెంట్ వెనుక ...రీజనేంటీ



హైదరాబాద్: ప్రజా క్షేత్రంలో ఓడిపోయినా.. న్యాయస్థానంలో గెలిచామని గులాబీ నేతలు డబ్బా కొట్టుకుంటున్నా రా? ఈ విషయంలో కేసీఆర్ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు? ఎమ్మెల్యేలపై వేటు కష్టమనే విషయం ఆయనకు ముందే తెలుసా? అందుకోసమే న్యాయస్థానం తీర్పు ఇచ్చినా సైలెంట్ ఉన్నారా? పార్టీ నుంచి వెళ్లబోయే ఎమ్మెల్యేలను ఆపేందుకు ఈ ఎత్తుగడ వేశారా? ఇలా రకరకాల ప్రశ్నలు రైజ్ అవుతున్నాయి. తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులపై బీఆర్ఎస్ నేతలు వేసిన అనర్హత పిటిషన్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ అంశాన్ని కేవలం నాలుగు వారాల్లో తేల్చాలని స్పీకర్ కార్యాలయం కార్యదర్శిని ఆదేశించింది.న్యాయస్థానం తీర్పుపై గులాబీ పార్టీ నేతలు ఎంజాయ్ చేశారు.. చేస్తున్నారు. కేసు గురించి ఏం జరుగుతుందో కూడా బీఆర్ఎస్ నేతలకు అంతా తెలుసు. న్యాయస్థానం తీర్పు రాగానే అదిగో ఉప ఎన్నికలు వస్తున్నాయంటూ హడావుడి తప్పితే.. ఏమీ ఉండదని వాళ్లకూ తెలుసు.ఇక్కడ చాలా అంశాలను ప్రస్తావిస్తున్నారు కాంగ్రెస్ వాదులు. ఎమ్మెల్యేల అనర్హత గురించి నిర్ణయం తీసుకునే అధికారం న్యాయస్థానాలకు లేదని చెబుతున్నారు. ఏది జరిగినా స్పీకర్ నిర్ణయం మేరకు మాత్రమే ఉంటుంది. ఆయన నిర్ణయంపై న్యాయస్థానం రాజ్యాంగ సమీక్ష చేసే అధికారం కలిగి ఉంటాయని కొన్ని కేసుల సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయం తెల్సిందే. న్యాయస్థానం గడువు ఇచ్చిన నాలుగువారాలు అంటే ఒక నెల. నాలుగు వారాల తర్వాత న్యాయస్థానం ఇచ్చే తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయవచ్చు. ఇక్కడ కుదరదంటే సుప్రీంకోర్టుకు వెళ్లవచ్చు. ఈ తతంగమంతా అయ్యేసరికి మూడు లేదా నాలుగేళ్లు పడే ఛాన్స్ వుందని అంటున్నారు.అందుకే ఈ విషయంలో మాజీ సీఎం కేసీఆర్ సైలెంట్‌గా వున్నారని, అంత హ్యాపీగా లేరని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ తరహా పనులే చేసిందని గుర్తు చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు.బీఆర్ఎస్ నుంచి వెళ్లిన, త్వరలో వెళ్లబోతున్న ఎమ్మెల్యేలను కాస్త భయపెట్టడం తప్పితే మరొకటి లేదన్నది ఆ పార్టీ నేతలే స్వయంగా చెబుతున్నారు. ఎమ్మెల్యేల అనర్హత గురించి మాట్లాడే నైతిక హక్కు కారు పార్టీకి లేదంటున్నారు. గడిచిన పదేళ్లు కేసీఆర్ వివిధ పార్టీలను బీఆర్ఎస్‌లో కలిపేశారని గుర్తు చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ ఆ విధంగా చేయలేదని అంటున్నారు. ఆ పార్టీలో లైఫ్ ఉందని భావించిన నేతలు వస్తున్నారని అంటోంది. ఎమ్మెల్యే అనర్హతపై బీజేపీ నేతలు నోరు ఎత్తే ఛాన్స్ లేదని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. గడిచిన పదేళ్లు కేంద్రంలోని మోదీ సర్కార్ ఆ తరహా ఎత్తుగడులు ఎన్నో చేసిందని అంటున్నారు.పెద్దల సభలో మెజార్టీ లేకుండా ప్రత్యర్థి పార్టీ నేతల చేత రాజీనామా చేయించి బలాన్ని పెంచుకుందని అంటున్నారు. ఇప్పుడూ అదే చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. రీసెంట్‌గా టీఎంసీ రాజ్యసభ సభ్యుడు రాజీనామా వెనుక ఇదే జరిగిందని గుర్తు చేస్తున్నారు. గతంలో టీడీపీ ఎంపీలను ఆ పార్టీకి రాజీనామా చేయించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు

# నితీశ్ కు నో ఎంట్రీ..

పాట్నా: దేశంలో రాజకీయ వాతావరణం మారినప్పుడుల్లా గోడదూకడం బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు అలవాటుగా మారిందని ఆర్‌జేడీ విమర్శించింది. ఇకపై అతడిని మళ్లీ అక్కున చేర్చుకునేది లేదని ఆ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తేల్చి చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు నితీశ్‌కు అవకాశం కల్పించి మోసపోయామని మళ్లీ అతడు డ్రామాలు మొదలు పెట్టాడని.. ఈ సారి నమ్మేదే లేదని ఆర్జేడీ అధినేత తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ విషయంపై ఆ పార్టీ సీనియర్ నేత.. తేజస్వీ యాదవ్ స్పష్టమైన ప్రకటన చేశారు. బీజేపీతో అలయన్స్‌లో ఉన్నందుకు చేతులు జోడించి తమ పార్టీ ఎమ్మెల్యేల ఎదుట నితీశ్ క్షమాపణలు కోరారని.. అయినా ఆయన్ని విశ్వసించబోయేది లేదని చెప్పారు. ఈ కప్పదాట్ల వ్యవహారాలకు కాలం చెల్లిందని.. రెండు సార్లు మోసపోయిన తాము మరోసారి మహాకూటమిలోకి ఆయన్ని రానిచ్చేదే లేదని.. మహాఘట్ బంధన్ ద్వారాలు మరోసారి ఆయన కోసం తెరుచుకోబవని తేజస్వీ కుండబద్దలు కొట్టారు. నితీశ్ కుమార్ తేజస్వీతో భేటీ అయిన కాసేపటికే ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. నితీశ్ చేసే ప్రమాణాలన్నీ నీటి మూటలనేనని.. అతడిపై ఎవరికీ నమ్మకం లేదని.. ఆయన ఎప్పుడైనా తన మనసు మార్చుకోగల ఊసరవెల్లి అని తేజస్వీ వ్యాఖ్యానించారు. రెండు సార్లు జాలిపడి రాజకీయంగా ప్రాణదానం చేస్తే ఆ వెంటనే తమకు వెన్నుపోటు పొడిచారని తేజస్వీ పేర్కొన్నారు. ఈ సారి మాత్రం అలాంటి తప్పు జరగబోదన్నారు. అర్‌జేడీని రూట్ లెవల్లో పటిష్ఠం చేయడమే లక్ష్యంగా తేజస్వీ యాదవ్ ఆభార్ యాత్రను మంగళవారం ప్రారంభించారు. తొలిరోజును కార్యకర్త సందర్శన్- సంవాద్ పేరుతో కార్యకర్తల కష్టనష్టాలను విన్నారు. వారి నుంచి పార్టీ కోసం సలహాలు తీసుకున్నారు. భాజపా- జేడీయూ అలయన్స్‌లో నితీశ్ నేతృత్వంలో కొనసాగుతున్న సర్కార్‌కు బిహార్ ప్రజల రక్షణ గురించి అసలు పట్టడం లేదని.. లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిని నేరాలు మితి మీరి పోయాయని తేజస్వీ ధ్వజమెత్తారు. 2025 ఎన్నికల్లో తాము అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు.మొదటిసారి 2013లో ఎన్డీయే అలయన్స్ నుంచి బయటకు వచ్చిన నితీశ్ ఆ కూటమితో 17 బంధానికి తెరదించారు. ఆ తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్నారు. వెంటనే వ్యూహం మార్చిన ఆయన.. ఒకప్పటి స్నేహితుడు, నాటికి ఆగర్భ శత్రువులా ఉన్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు స్నేహహస్తం అందించారు. ఆ తర్వాత 2015లో ఆర్జేడీ తో అధికారం పంచుకున్న నితీశ్.. రెండేళ్లు తిరగక ముందే మహాఘట్‌బందన్‌కు రాంరాం చెప్పి మళ్లీ ఎన్డీయే తో కలిశారు. 2020 ఎన్నికల్లో మళ్లీ భాజపాతో కలిసి అధికారాన్ని చేజిక్కించుకున్న నితీశ్ మళ్లీ 2022లో భాజపాకు దూరం జరిగి ఆర్జేడీ తో జట్టు కట్టి మహాఘట్‌బంధన్‌కు జైకొట్టారు. మళ్లీ 2024 సార్వత్రిక సమరం సమయానికి ఎన్డీయే గూటికి చేరి కూటమిలో మూడో అతి పెద్ద పార్టీగా అవతరించారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల సైరన్ మోగే సమయం దగ్గర పడుతుండడంతో ఆర్జేడీ కి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే ఈ సారి నితీశ్‌ను నమ్మేది లేదని ఆర్జేడీ అధినాయకత్వం తేల్చిచెప్పింది.

# హేమ డ్రగ్స్ తీసుకుంది... తేల్చి చెప్పిన పోలీసులు

బెంగళూరు: బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీ సమీపంలోని ఫామ్‌హౌస్‌లో మే 15న నిర్వహించిన రేవ్ పార్టీపై దాడి చేసిన సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ( సీసీబీ ) అధికారులు సోమవారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నటి హేమ సహా ఇతర సినీ నటులు పాల్గొన్నారన్న ఆరోపణలతో.. ఈ రేవ్ పార్టీ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయింది. వాసు అనే వ్యక్తి బర్త్ డేతో పాటు తన ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ పార్టీ ఏర్పాటు చేశాడు.కేసు దర్యాప్తును పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ లీడ్ చేశారు. తాజాగా ఆయన 1,086 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. అందులో నటి హేమ ఎండీఎంఏ సేవించిందని పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఆమె వైద్య పరీక్ష ఫలితాలను జతపరిచారు. పార్టీకి హాజరైన మరో నటికి టెస్టులు చేయగా.. డ్రగ్స్ నెగెటివ్ వచ్చిందని.. ఆమె సాక్షుల్లో ఒకరిగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలో పట్టుబడిని తర్వాత హేమ చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. తాను అసలు ఆ పార్టీకే వెళ్లలేదని.. హైదరాబాద్‌లో ఉన్నట్లు వీడియో విడదుల చేసింది. తాను ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని తెలిపింది. అయితే ఆమె మెడికల్ రిపోర్టు పాజిటివ్ అని తేలడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఆపై ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హేమ? వాసు, అరుణ్‌లకు ఫ్రెండ్. వారు ఆమెను పార్టీకి ఆహ్వానించారు. చార్జిషీట్‌లో మొత్తం 88 మందిని నిందితులుగా గుర్తించారు. వాసు, అతని స్నేహితులు చిత్తూరు జిల్లాకు చెందిన డెంటిస్ట్ రణధీర్ బాబు, కోరమంగళకు చెందిన అరుణ్ కుమార్, నాగబాబు, మహ్మద్ అబూబకర్, అగస్టిన్ దాదాగా గుర్తింపు పొందిన నైజీరియన్ దేశస్థుడ్ని పార్టీ ఆర్గనైజ్ చేసినందుకు, డ్రగ్స్ సప్లై చేసినందుకు నిందితులుగా చేర్చారు. హేమతో సహా మిగిలిన 79 మంది నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం సెక్షన్ 27 (బి) ? (ఏదైనా మాదక ద్రవ్యం లేదా సైకోట్రోపిక్ పదార్ధం సేవించినం దుకు శిక్ష) కింద బుక్ చేశారు. సెక్షన్ ప్రకారం, నిందితులకు ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 10,000 వరకు జరిమానా శిధిస్తారు. లేదా కోర్టు విచక్షణ మేరకు జైలు శిక్షతో పాటు ఫైన్ ఫైన్ రెండూ వేయవచ్చు. నిందితుల కాల్ డిటైల్స్ రికార్డు (సీడీఆర్)ను కూడా పోలీసులు కోర్టుకు సమర్పించారు. స్పాట్‌లో ఎండిఎంయే మాత్రలు, ఎండిఎంయే క్రిస్టల్, ఆరు గ్రాముల హైడ్రో గంజాయి, ఐదు గ్రాముల కొకైన్, కొకైన్ పూతతో కూడిన 500 రూపాయల నోటు, 6 కిలోల హైడ్రో గంజా, 5 మొబైల్ ఫోన్లు, వోక్స్‌వ్యాగన్ కారు, ల్యాండ్ రోవర్ కారు వంటివి సీజ్ చేసినట్లు.. చార్జిషీట్‌లో చూపించారు.

# సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం

హైదరాబాద్: సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమైన రోజు. ఏళ్ల తరబడి నిజాం పాలనలో ఉన్న తెలంగాణ.. నిరంకుశపాలనను బద్దలు కొట్టి ప్రజాస్వామ్యంలో ఏకమైన రోజు. 1948 సెప్టెంబర్ 17 హైదరాబాద్ రాష్ట్రం.. భారతదేశంలో కలిసిన రోజు. అయితే ఈ సెప్టెంబర్ 17 ప్రతేదాది తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర మాటల యుద్ధానికి దారి తీస్తుంది. సెప్టెంబరు 17 నాటికి ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఈ రచ్చ తప్పడం లేదు. ఈ రోజును ఒక్కో పార్టీ ఒక్కో విధంగా జరుపుకుంటుంది.దీంతో ఈ సారి సెప్టెంబర్ 17పై రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 33 జిల్లాల్లో జెండాను ఆవిష్కరించే ప్రజాప్రతినిధుల పేర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఆ రోజున రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండా ఎగరవేయనున్నారని తెలిపింది.

జెండా ఎగురవేసే ప్రజాప్రతినిధులు ఎవరంటే

× ఆదిలాబాద్ – షబ్బీర్ అలీ (ప్రభుత్వ సలహాదారు)
× భద్రాద్రి కొత్తగూడెం – తుమ్మల నాగేశ్వర రావు(వ్యవసాయ శాఖ మంత్రి)
× హన్మకొండ –కొండా సురేఖ (పర్యావరణ ు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి)
× జగిత్యాల – ఎ. లక్ష్మణ్ కుమార్(ప్రభుత్వ విప్)
× జయశంకర్ భూపాలపల్లి – పోడెం వీరయ్య( ఛైర్మన్ తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్)
× జనగాం– బీర్ల ఇల్లయ్య( ప్రభుత్వం విప్)
× జోగులాంబ గద్వాల్– ఏపీ జితేందర్ రెడ్డి (ప్రభుత్వ సలహాదారు) (క్రీడా వ్యవహారాలు)
× కామారెడ్డి– పటేల్ రమేష్ రెడ్డి (ఛైర్మన్ తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్)
× కరీంనగర్ –డి.శ్రీధర్ బాబు (ఐటీ మంత్రి)
× ఖమ్మం – డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
× కుమురంభీమ్ ఆసిఫాబాద్–బండ ప్రకాష్ (శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్)
× మహబూబాబాద్ – జె. రాంచందర్ నాయక్ (ప్రభుత్వ విప్)
× మహబూబ్ నగర్ –జూపల్లి కృష్ణరావు (ప్రొహిబిషన్ ు ఎక్సైజ్ మంత్రి)
× మంచిర్యాల– హరకర వేణుగోపాలరావు (ప్రభుత్వ సలహాదారు)
× మెదక్ – కె. కేశవ రావు ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు)
× మేడ్చల్ –పట్నం మహేందర్ రెడ్డి (ఎమ్మెల్సీ)
× ములుగు – మంత్రి సీతక్క
× నాగర్‌కర్నూల్– జి. చిన్నారెడ్డి (వైస్–ఛైర్మన్, ప్లానింగ్ బోర్డ్)
× నల్గొండ– మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
× నారాయణపేట – గురునాథ్ రెడ్డి (తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్)
× నిర్మల్ – రాజయ్య (సిరిసిల్లా ఛైర్‌పర్సన్, తెలంగాణ ఫైనాన్స్ కమిషన్)
× నిజామాబాద్ – అనిల్ ఎరావతి (తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ ఛైర్‌పర్సన్)
× పెద్దపల్లి – నేరెళ్ల శారద (తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్)
× రాజన్న సిరిసిల్ల– ఆది శ్రీనివాస్ (ప్రభుత్వ విప్)
× రంగారెడ్డి– వేం నరేందర్ రెడ్డి (ముఖ్యమంత్రి సలహాదారు)
× సంగారెడ్డి– మంత్రి దామోదర రాజనరసింహ
× సిద్దిపేట – మంత్రి పొన్నం ప్రభాకర్
× సూర్యాపేట– మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
× వికారాబాద్ – స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
× వనపర్తి – ప్రీతమ్ (ఛైర్‌పర్సన్, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్)
× వరంగల్ – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
× యాదాద్రి భువనగిరి – గుత్తా సుఖేందర్ రెడ్డి (గౌరవ ఛైర్మన్, టీఎస్ఎల్‌సీ)

కొంత కాలంగా సెప్టెంబర్ 17 నిర్వహణపై వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 17ని విమోచన దినోత్సవంగా జరుపుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు సర్కార్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ విమోచనోద్యమంలో అమరవీరులయిన వారికి గౌరవసూచకంగా ప్రతేదాది సెప్టెంబర్ 17ని హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఇక, గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2022,2023లలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుక నిర్వహించగా రెండు సందర్భాల్లో ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరయ్యారు.

# కాంగ్రెస్ కండువాలు కాదు... దేవుడి కండువాలు

## తెరపైకి కొత్త వాదనతో జంపింగ్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులు తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి. పార్టీ మారిన ముగ్గురిపై నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించడంతో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకోగా, అందులో ముగ్గురిపై కోర్టులో కేసు వేసింది బీఆర్ఎస్. ఆ ముగ్గురిపై చర్యలకు కోర్టు ఆదేశించడంతో ఇప్పుడు మిగిలిన ఏడుగురు కొత్త వాదన తెరపైకి తెస్తున్నారు. మేము పార్టీ మారలేదని చెబుతుండటంతోపాటు తమ మెడలో వేసిన మూడు రంగుల కండువాలు దేవుడి కండువాలుగా ప్రచారం మొదలుపెట్టారు. అనర్హత వేటు నుంచి తప్పించుకోడానికి తాము పార్టీ మారలేదని చెప్పుకోవడమే కాకుండా కాంగ్రెస్ కండువాకు పేరు మార్చి దేవుడి కండువాలుగా కలరింగ్ ఇవ్వడమే ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ నుంచి మొత్తం పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా, అందులో ముగ్గురు పార్లమెంట్ ఎన్నికల ముందు మూడు రంగుల కండువా కప్పుకున్నారు. ఇక ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాలు పట్టుకుని ప్రచారం చేశారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం కనుక వారిపై అనర్హత వేటు వేయాల్సిందిగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది బీఆర్ఎస్. ఆ తర్వాత హైకోర్టును కూడా ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే రెండు రోజుల క్రితం అనర్హత పిటిషన్‌పై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది హైకోర్టు. దీంతో మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు అలర్ట్ అయ్యారుఅనర్హత వేటు వేయించుకుని ఎక్కడ ఉప ఎన్నికలకు వెళ్లాల్సి వస్తోందననే ఆలోచనతో అబ్బే? తాము పార్టీ మారలేదని? అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని చెబుతున్నారు. అంతేకాకుండా సాంకేతికంగా తాము కప్పుకున్నది కాంగ్రెస్ కండువా కాదని? కాంగ్రెస్ కండువా అయితే దానిపై ఆ పార్టీ గుర్తు, పార్టీ అధ్యక్షుల ఫొటోలు ఉండాలి కదా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. తాము సీఎంను కలిస్తే దేవుడి కండువా కప్పి సత్కరించారని ప్రచారం స్టార్ట్ చేశారు.ఇలా దేవుడి కండువాలు కప్పుకున్నామంటున్న ఎమ్మెల్యేల వాదనలను నెటిజన్లు ఏకిపారేస్తున్నారు. పార్టీ ఫిరాయించిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పీఏసీ ఛైర్మన్‌గా నియమించింది ప్రభుత్వం. కాంగ్రెస్ ఎమ్మెల్యేకు పీఏసీ పదవి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ ప్రశ్నిస్తే.. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని వివరణ ఇచ్చారు ఎమ్మెల్యే గాంధీఎమ్మెల్యే వాదన ఇలా ఉంటే? ఆయన సోషల్ మీడియా అకౌంట్లలో కాంగ్రెస్‌లో చేరినట్లు ఎమ్మెల్యే గాంధీ స్వయంగా ప్రకటించిన పోస్టుల సంగతేంటి? అంటూ నిలదీస్తున్నారు నెటిజన్లు. ఇక గాంధీని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి చేసిన పోస్టును ట్రోల్ చేస్తున్నారు. ఒక్క గాంధీయే కాదు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు తప్ప మిగిలిన ఏడుగురు దేవుడి కండువాలన్న వాదనే ఎత్తుకున్నారు.వాస్తవానికి ఒక పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే? ఇంకో పార్టీ వేదికలపై కనిపించడంగానీ, ఆ పార్టీ జెండాలు, చిహ్నాలను ప్రచారం చేయడం, సొంత పార్టీ నేతలను విమర్శించడం.. వంటివి ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకే వస్తాయి. ఇలా ఈ ఏడుగురు ప్రభుత్వంతో రాసుకుపూసుకు తిరగడమే కాకుండా? కాంగ్రెస్ నాయకులుగా చెలామణి అవుతున్న విషయమే ఎప్పటికప్పుడు ఆధారాలు సేకరిస్తోంది బీఆర్ఎస్. దీంతో బీఆర్ఎస్ చర్యలకు విరుగుడుగా దేవుడి కండువాలు అన్న కొత్త వాదన తెరపైకి తెస్తున్నారు జంపింగ్ ఎమ్మెల్యేలు. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో కానీ, ఎమ్మెల్యేల కొత్త వాదన మాత్రం రాజకీయంగా ఆసక్తికరంగా మారుతోంది.

# ఉప ఎన్నికల సవాళ్లు...

## గెలుపుపై రెండు పార్టీల్లో ఆందోళన

హైదరాబాద్: 2023 సంవత్సరం చివరి నెలలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అప్పటి అధికార భారత రాష్ట్ర సమితి ప్రతిపక్షానికి పరిమితం అయిపోయింది. అయితే భారత రాష్ట్ర సమితి నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో స్టేషన్ ఘన్ పూర్, ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు ఉన్నారు. అయితే వీరిపై అనర్హత వేటు విధించాలని భారత రాష్ట్ర సమితి హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. ఫలితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలర్ట్ అయ్యారు. అంతేకాదు ఆయన ముందు ఉన్న ప్రత్యామ్నాయాలపై కసరత్తు మొదలుపెట్టారు. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే.. వాటికి సిద్ధం కావాలని నిర్ణయించారు. ఇప్పటికే పను నివేదికలను అధ్యయనం చేస్తున్నారు. అయితే ఇదే సమయంలో మరొక విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది..కోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. భారత రాష్ట్రసంతి నుంచి పది మంది ఎమ్మెల్యేలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విధించాలని భారత రాష్ట్ర సమితి స్పీకర్ కు ఫిర్యాదు చేసింది. అనంతరం హైకోర్టు తలుపు తట్టింది. నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేసింది. స్పీకర్ నిర్ణయం కీలకంగా మారింది. ఇక మిగతా ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లు స్పీకర్ వద్ద పెండింగ్లో ఉన్నాయి. అయితే ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ నడుస్తోంది.ఒకవేళ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ లేదా అవసరమైతే సర్వోన్నత న్యాయస్థానం వరకు వెళ్తామని కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు చెబుతున్నారు. అయితే అక్కడ ఎలాంటి ఫలితం వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అరవైపు 16 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుంటే రాజకీయంగా రేవంత్ భారత రాష్ట్ర సమితిపై అప్పర్ హ్యాండ్ సాధించినట్లవుతుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ స్థాయిలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేర్తారనేది? ఒకింత సందేహమే. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే.. వాటికి ఎలా సన్నద్ధం కావాలనే దానిపై కాంగ్రెస్ పార్టీలో లోతుగా చర్చ నడుస్తున్నట్టు తెలుస్తోంది.ఏడాది పూర్తి కాకుండానే ఉప ఎన్నికలకు వెళ్తే ప్రజల స్పందన.. రాజకీయంగా పార్టీకి ఉన్న బలాలను రేవంత్ రెడ్డి పలు నివేదికల ద్వారా తెలుసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ ఉప ఎన్నికలు నిర్వహించడం ఖాయం అయితే పదిమంది ఎమ్మెల్యేల్లో కొంతమంది భారత రాష్ట్ర సమితికి తిరిగి వెళ్లే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.. ఇప్పటికే ఎన్నికల హామీలు పూర్తి చేయకపోయినప్పటికీ.. చేస్తున్న వాటితో ప్రజల్లో సానుకూల దృక్పథం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు.. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్తే క్షేత్రస్థాయిలో ప్రతికూల ఫలితాలు వస్తాయనే ఆందోళన కూడా ఆ పార్టీ నేతలలో కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత.. హైకోర్టు తీర్పుపై ఎలా ముందుకు సాగుతారు? ఉప ఎన్నికలు వస్తే ఎలాంటి ప్రణాళిక రూపొందిస్తారు? అనే విషయాలపై ఒక స్పష్టత వస్తుందని కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు చెబుతున్నారు.

# కాకతీయ భూములపై విజిలెన్స్

వరంగల్: కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు రెండు రోజులుగా వర్సిటీ చుట్టూ ఉన్న ఆక్రమణలను తేల్చేందుకు సర్వే చేస్తుంది. ముఖ్యంగా సర్వే నెంబర్ 229 భూములలో సర్వే చేసి సరిహద్దు గుర్తించింది. ఇక్కడ ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు రెండు రోజులుగా యూనివర్సిటీ చుట్టూ ఉన్న కబ్జాలు తేల్చే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్, కాకతీయ యూనివర్సిటీ డెవలప్ మెంట్ ఆఫీసర్స్ తో కలిసి విజిలెన్స్ అధికారులు జాయింట్ ఇన్ స్పెక్షన్ చేస్తున్నారు. ప్రధానంగా ఎప్పటి నుంచో ఆరోపణలున్న సర్వే నెంబర్ 229 భూములపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బుధవారం ఆ సర్వే నెంబర్ చుట్టూ పక్కల ఉన్న బౌండరీలను గుర్తించారు. ఆ భూమిలో ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో కుమార్ పల్లి, లష్కర్ సింగారం, పలివేల్పుల గ్రామాల పరిధిలోని 673.12 ఎకరాల భూమిని సేకరించారు. కానీ కేయూ క్యాంపస్ చుట్టూ సరైన విధంగా రక్షణ లేని కారణంగా ఆక్రమణలు వెలిశాయి. ముఖ్యంగా కుమార్ పల్లి శివారులోని 229 సర్వే నెంబర్, పలివేల్పుల శివారు 412, 413, 414, లష్కర్ సింగారం శివారు 34 సర్వే నెంబర్ లో కూడా కబ్జాలు జరిగాయనే ఆరోపణలున్నాయిఇదిలా ఉంటే కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ బాబుతో పాటు మరికొంతమంది కుమార్ పల్లి శివారు 229 సర్వే నెంబర్ లోనే ఇళ్లు కట్టుకుని ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోనే గతంలో వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టారు. రూ.కోట్లు విలువైన యూనివర్సిటీ భూములను అధికారులే నొక్కేస్తున్నారంటూ నిరసనలు కూడా కొనసాగించారు. ఆ తరువాత అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) అధ్యక్ష, కార్యదర్శులు ప్రొ.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో ఇదివరకు వీసీతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గత ప్రభుత్వ పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తరువాత మరోసారి ఇన్చార్జ్ వీసీ వాకాటి కరుణతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీకి కూడా ఫిర్యాదు చేశారుఅకుట్ ఫిర్యాదుతో పాటు కాకతీయ యూనివర్సిటీ ఇన్చార్జ్ వీసీ వాకాటి కరుణ విజ్ఞప్తి మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు కాకతీయ యూనివర్సిటీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. విజిలెన్స్ సీఐలు రాకేష్, అనిల్ ఆధ్వర్యంలో గత నెల 31వ తేదీన మొదటి దఫా జాయింట్ ఇన్ స్పెక్షన్ నిర్వహించారు. కేయూ అధికారులతో పాటు మున్సిపల్, రెవెన్యూ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ తదితర శాఖల అధికారులతో కలిసి సర్వే చేపట్టారు.ఇదిలాఉంటే వర్సిటీ భూముల్లో ప్రధానంగా కుమార్ పల్లి శివారు సర్వే నెంబర్ 229 లో కేయూ అధికారి అయిన అశోక్ బాబు ఇల్లు ఉండటంతో ఆఫీసర్లు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ముఖ్యంగా ఇదే సర్వే నెంబర్ పై ఆరోపణలు ఎక్కువగా ఉండటంతో రెండు రోజులుగా అదే ల్యాండ్ లో అధికారులు సర్వే జరుపుతున్నారు. మంగళవారం సర్వే నెంబర్ 229 భూమిని పరిశీలించిన విజిలెన్స్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కేయూ, మున్సిపల్ అధికారులు.. బుధవారం డీమార్కేషన్ చేపట్టారు. ఈ మేరకు సర్వే నెంబర్ 229లో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.ఆఫీసర్లు కబ్జాగా గుర్తించిన సర్వే నెంబర్ 229లో చాలా వరకు ఇళ్లు వెలిశాయి.

కాగా బుధవారం జాయింట్ ఇన్ స్పెక్షన్ టీమ్ అధికారులు హద్దులు గుర్తించి మార్కింగ్ వేయడంతో అక్కడ ఇల్లు కట్టుకుని ఉంటున్న వారిలో గందరగోళం మొదలైంది. ఇదిలాఉంటే ఓ వైపు సర్వే జరుగుతుండగా.. మరోవైపు కబ్జా ఆరోపణలున్న ఇళ్ల యజమానులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు నోటీసులు కూడా జారీ చేశారు. దాదాపు 76 మందికి నోటీసులు అందజేశారు. దీంతో అందులో కొంతమంది కోర్టుకు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలాఉంటే ఇప్పుడిప్పుడే కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణల వ్యవహారం ఓ కొలిక్కి వస్తుండటంతో భూఆక్రమణ దారుల్లో కలవరం మొదలైంది. కాగా కాకతీయ యూనివర్సిటీ చుట్టూ సమగ్ర భూసర్వే నిర్వహించి, అన్యాక్రాంతమైన భూములను కబ్జా చెర నుంచి విడిపించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలతో పాటు అకుట్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు

# అంజన్నను దర్శించుకున్న మహిళ అఘోర

జగిత్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయ స్వామిని మహిళా అఘోర దర్శించుకున్నారు.లోక కళ్యాణం కోసమే ఆలయాల సందర్శన చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే కొండగట్టు శివారులో ఆశ్రమం ఏర్పాటు చేసి ప్రకృతి సేవ చేస్తానని మహిళ అఘోర వెల్లడించారు. మానవ సేవ కంటే ప్రకృతి సేవ చాలా గొప్పదని ఈ సందర్భంగా తెలిపారు. తాను వచ్చే మార్గమధ్యంలో వైకుంఠధామంలో పూజలు చేసినట్లు అలాగే పూజలు చేసిన ప్రాంతాన్ని మాత్రం వెల్లడించలేదు మహిళ అఘోర. ఆలయాల సందర్శన కోసం హరిద్వార్ నుండి వచ్చినట్లు తెలంగాణలోని ఆలయాలన్నింటిని సందర్శిస్తానని తెలిపారు. ఆలయ అర్చకులు ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికారు.

# బాన్సువాడలో తల్వార్ తో దాడి కలకలం

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని తడ్కోల్ చౌరస్తా సమీపంలో మధురాలయ బార్ పరిసరాలలో బుధవారం తల్వార్ తో దాడి చేసిన సంఘటన కలకలం సృష్టించింది.మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకుల మధ్య మాటకు మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా, సోను సింగ్ అనే యువకుడు ఆటో డ్రైవర్ సంజీవ్ పై తల్వార్ తో దాడి చేశాడు.

స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు ఆటో డ్రైవర్ సంజీవును హుటాహుటీన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స ను అందించిన ఆసుపత్రి సిబ్బంది పరిస్థితి విషమంగా ఉండటం తో అక్కడి నుండి నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 111 ఎకరాలు... 262 అక్రమ నిర్మాణాలు

హైదరాబాద్: అక్రమ నిర్మాణదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న హైడ్రా ఇప్పటివరకు 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా తెలిపింది. మొత్తం 23 ప్రాంతాల్లో ఈ కూల్చివేతలను చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. చెరువులు, నాలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో గత రెండు నెలలుగా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది హైడ్రా. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేస్తూ వస్తోంది. జంట నగరాల్లో హైడ్రా హాట్ టాపిక్‌గా మారింది.

హైడ్రా కూల్చివేతల జాబితా:

- అత్యధికంగా అమీన్‌పూర్ చెరువు పరిధిలో 51 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది.
- మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది.
- దుండిగల్ కత్వా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు హైడ్రా తెలిపింది.
- ముషీరాబాద్ పరిధిలోని రాంనగర్‌లో మణెమ్మ గల్లీలో నాలాపై 3 అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది.
- మాదాపూర్ సున్నం చెరువులో 42, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు ప్రభుత్వానికి హైడ్రా నివేదిక అందజేసింది.

హైడ్రా కూల్చివేతల్లో కొన్ని పేదలకు సంబంధించిన నిర్మాణాలు కూడా ఉన్నాయి. ఈ అంశంపై ప్రతిపక్షాలు విమర్శల వర్షం కురిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువుల్లో 11 వేల మంది పేదలకు ఇళ్లు ఉన్నాయని.. వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.అక్రమ నిర్మాణాల కూల్చివేతలో హైడ్రా తన వ్యూహాన్ని మార్చుకుంది. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లపై రీ-సర్వే చేసి కొత్తగా మార్క్ చేశాకే కూల్చివేత చర్యలు చేపట్టనుంది. కొన్నేళ్లుగా శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న వారి జోలికి వెళ్లబోమని హైడ్రా స్పష్టం చేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో కొత్తగా నిర్మించే ఇళ్లు, భవనాలను కూల్చివేస్తామని ప్రకటించింది. బిల్డర్ల ద్వారా బాధితులకు పరిహారం ఇప్పించేందుకూ సిద్ధమైంది.హైడ్రాకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులను హైడ్రాకు కేటాయించింది. వీరందరూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ఆక్రమణల కూల్చివేత కోసం పనిచేయనున్నారు. హైడ్రా చర్యలు వేగవంతం కానున్నాయని చెప్పేందుకు ఈ నిర్ణయం కూడా బలోపేతం చేస్తోంది.మరోవైపు.. హైడ్రా కూల్చివేతల అంశంపై దుమారం రేగుతుండగా, ఈ వ్యవస్థకు బలం చేకూరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. చెరువులు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వాళ్లలో ఎంతటి మహామహులు ఉన్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. హైడ్రా టాస్కే చెరువులను, నాలాలను సంరక్షించడం అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో హైడ్రా రానున్న రోజుల్లో మరింత దూకుడుగా కూల్చివేతల చర్యలను చేపట్టనున్నట్లు సంకేతాలు అందుతున్నాయి.ఇదిలా ఉండగా.. హెచ్ఎండీఏ వెబ్‌సైట్ సర్వర్‌పై ఓవర్ లోడ్ కారణంగా సేవలకు అంతరాయం కలిగింది. ఉదయం నుంచి ఓవర్ లోడ్ సమస్యతో హెచ్ఎండీఏ ఆన్‌లైన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. డేటా ఓవర్ లోడ్ అయినట్లు అధికారులు గుర్తించారు. ఓవర్ లోడ్ అయిన డేటాను ప్రత్యేకంగా స్టోర్ చేసే ప్రయత్నాలు చేపట్టారు. సేవలను అతి త్వరలో పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

# ఉచిత యునాని వైద్య శిబిరం

కోరుట్ల: ఆయుష్ డిపార్ట్మెంట్ వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు కోరుట్ల ప్రభుత్వ యునాని వైద్యశాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఐబి గెస్ట్ హౌస్ బంగ్లాలో గురువారం ఉచిత యునాని వైద్య శిబిరం నిర్వహించారు..ఈ సందర్భంగా యునాని వైద్యాధికారిని డాక్టర్ సమీన ఖాస్మీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులుపంపిణీ చేశారు. ఈ సందర్భంగాసుమారు 152 మంది రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టులు పి. శైలజ, డి. శ్రీనివాస్, యునాని వైద్య సిబ్బంది, షేక్ రెహమాన్ అలీ, డి.గంగా నర్సయ్య, గంగమ్మ ,మొహమ్మద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు

# స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలు విస్తరిస్తాం

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో అన్ని రంగాల్లోనే మార్పు సాధిస్తున్నట్లుగానే క్రీడారంగంలో సమూలమైన మార్పులు సాధిస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు. ఈరోజు ఎల్బీ స్టేడియం లోని తన చాంబర్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాతక్రీడలకు చారిత్రాత్మకమైన బడ్జెట్ 364 కోట్లు కేటాయించడం జరిగిందని, గ్రామీణ క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇచ్చేందుకు నూతన క్రీడా విధానానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. ప్రతి లోక్సభ నియోజకవర్గానికి ఒక స్పోర్ట్స్ స్కూల్ ను ఏర్పాటు చేస్తూ వాటిని ఏర్పాటు చేయబోయే స్పోర్ట్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ సత్వర చర్యలు చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాదు నగరాన్ని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు,ఫోర్త్ సిటీ,ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం, గోల్ఫ్ క్లబ్ కు ఏర్పాట్లు తో పాట క్రీడలకు ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని శివసేన రెడ్డి తెలిపారు.నగరంలో ఉన్న అన్ని స్టేడియాల పునరుద్ధరణ కై చర్యలు చేపడుతున్నామని,జాతీయ అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేందుకు అన్ని స్టేడియాలను తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. హైదరాబాద్ కి షాన్ హమారా షెహర్ కి జాన్ లాగా పేరు పొందిన ఫుట్ బాల్ కు పునర్ వైభవం తీసుకొచ్చేందుకుఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్ 2024 ఘనంగా నిర్వహించడము జరిగిందని ప్రతి క్రీడాంశానికి తగిన ప్రాధాన్యమిస్తూ మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తామని ఆయన తెలిపారు జాతీయ క్రీడా దినోత్సవం ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా నిర్వహించామని ఆగస్టు 27 28 29 తేదీలలో మూడు రోజులపాటు ఘనంగా వేడుకలు నిర్వహించడమే కాకుండా రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో కూడా ఘనంగా జాతీయ దినోత్సవాన్ని నిర్వహించి క్రీడాభిమానుల ప్రశంసలు అందుకున్నామని ఆయన వివరించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇచ్చే ప్రాధాన్యతను విస్పష్టంగా ప్రకటించడం జరిగిందని శాసనసభ చరిత్రలో క్రీడల పట్ల అంత సుదీర్ఘమైన చర్చ జరిగిన సందర్భాలు ఆయన అన్నారు. క్రీడారంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన భరోసాతో నూతన యావత్ తెలంగాణ క్రీడ సమాజంలో నూతన ఉత్సాహం నెలకొందని ఆయన అన్నారు ముఖ్యమంత్రి గారితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రివర్యులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సీతక్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలకు హాజరై క్రీడాకారుల్లో నూతన ఉత్సాహం అందించారని వివిధ జిల్లాలలో యావత్ క్యాబినెట్ మంత్రులు గౌరవ శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు విరివిగా క్రీడా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా నేను బాధ్యతలు చేపట్టిన దాదాపు ఈ రెండు నెలల కాలంలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చామని ఆయన ప్రకటించారు రేవంత్ రెడ్డి గారిప్రభుత్వమిచ్చిన నైతిక మద్దతుతో వి వివిధ క్రీడా సంఘాల సహకారంతో స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలు విరివిగా చేపడుతూ క్రీడా సమాజానికి మరింత చేరువవుతామని ఆయన ప్రకటించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్**

జగిత్యాల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టి వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం రోజున ధర్మపురి పట్టణం లోని బ్రాహ్మణ సంఘంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో మెగా వైద్య మరియు వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగాప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని,అకాల వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని,గత సంవత్సరంతో పోలిస్తే ఇప్పుడు కొంత డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదు కావడం జరిగిందని, కానీ ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదనీ,గత సంవత్సరంతో పోలిస్తే ఇప్పుడు క్యాంపులను, టెస్టులను మూడు వంతులు పెంచడం జరిగిందని,ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ప్రజలు కూడా స్వచ్ఛందంగా జాగ్రత్తలు పాటించాలని,మున్సిపల్ అధికారులు శానిటైజేషన్ పనులపైన ప్రత్యేక శ్రద్ధ చూపాలని,పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ,ప్రజల ఆరోగ్యం విషయంలో ఎక్కడ రాజీ పడే అవకాశం లేదని ఈ సందర్భంగా విప్ తెలిపారు.జ్వరాలు ప్రబలుతున్న వేళ ప్రజలు ఆందోళన చెందకుండా గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాలలో తగినన్ని మందులు రక్త పరీక్ష చేయు కిట్లు అందుబాటులో ఉన్నాయని, ఒకవేళ ఎక్కడైనా స్టాక్ తగ్గినట్లయితే మా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే ప్రభుత్వంతో మాట్లాడి సరిపడినంత స్టాకును తెప్పిస్తానని హామీ ఇచ్చారు.ఆనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ దోమలు అభివృద్ధి చెందకుండా చూసుకున్నట్లయితే మలేరియా,డెంగ్యూ,చికెన్ గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నుండి రక్షించుకోవచ్చునని తెలిపారు. ప్రజలు బాధ్యతాయుతంగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వాడిపడేసిన టైర్లు గాని, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, పగిలిపోయిన కుండలలో వర్షపు నీరు నిలిచి దోమలు పెరగడానికి ఆస్కారం ఉందన్నారు. కావున ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఆనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సమియుద్దీన్ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా మొదలగు పరీక్షలు ఉచితంగా చేసి మందులు సరఫరా చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, జిల్లాలో ఇప్పటివరకు 230 డెంగ్యూ పాజిటివ్ గా నమోదు చేయబడ్డాయని, వీరి ఇంటి పరిసరాలలో 50 హౌసెస్ వరకు ఐరిస్ స్ప్రే చేయించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సంఘీ సత్యమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, స్థానిక కౌన్సిలర్ అయ్యోరి వేణుగోపాల్, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది ఎమ్మార్వో కృష్ణ చైతన్య ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు, పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం.

**-టీపెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య.**

జగిత్యాల : పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీ ఎన్జీవోల సంఘ భవన్ లో టీ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా స్థాయి పెన్షనర్ల సమావేశం లో మాట్లాడుతూ ..పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం టీ ఉద్యోగుల జేఏసీ అనుబంధ సంఘంగా కలిసికట్టుగా ఉద్యమిస్తామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల,పెన్షనర్ల స్నేహపూర్వక ప్రభుత్వమని చెప్పుకొని ఉద్యోగుల, పెన్షనర్ల సంఘాలను నిర్వీర్యం చేయాలని చూసిందని,కేవలం పెన్షన్ పైనే జీవిస్తున్న పెన్షనర్లకు సైతం ప్రతి నెలా పెన్షన్ సకాలంలో ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డామన్నారు.కొత్త ప్రభుత్వం ఒకటో తేదేనే పెన్షన్లు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఐదు పెండింగ్ డి.ఏ.లు,పీ.ఆర్.సీ.ఫిట్మెంట్ 51 శాతం ఇవ్వాలని, కమ్యూటేషన్ 15 సంవత్సరంల నుంచి 12 సంవత్సరంలకు కుదించాలని,అన్ని కార్పోరేట్ అసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, మార్కెటింగ్, దేవాదాయ, గ్రంధాలయ ,అటామనస్ బాడీ పెన్షనర్లకు ఈ.హెచ్.ఎస్.సౌకర్యాలు కల్పించాలని, పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ తదితర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం,పాత పెన్షన్ పునరుద్ధరణకు, పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.ఈ మేరకు పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అధ్యక్షతన జిల్లా, మండల కమిటీలు తీర్మానాల ను ఏకగ్రీవముగా ఆమోదించారు. సమావేశంలో టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం,సహాయ అధ్యక్షుడు పి.సి.హన్మంత్ రెడ్డి,ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావు, ఎం.డి.యాకూబ్,విఠల్,జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్,కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,మెట్ పల్లి అధ్యక్షుడు గంగాధర్, ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్, మల్యాల అధ్యక్షుడు యాకూబ్,ఉప్పుగళ్ల మురళీధర్, కరుణ, విజయ లక్ష్మి మండల సంఘాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

# వచ్చే 3 నెలల్లో కులగణన చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం

జగిత్యాల: వచ్చే 3 నెలల్లో కులగణన చేపట్టాలని కోరుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పుహర్షణీయమని బిసి సంక్షేమ సంఘం నేతలు పేర్కొన్నారు.గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బిసి సంక్షేమ సంఘం సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వచ్చే 3 నెలల్లో కులగణన చేపట్టాలని హర్షణీయమని బిసి సంక్షేమ సంఘం సంతోషం వ్యక్తం చేసిందన్నారు.

ఐదేళ్ల క్రితం బిసి కులగణనపై రిట్ పిటిషన్ దాఖలు చేసినా గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో కేసు ఆగిపోయిందని అన్నారు. ఎట్టకేలకు దీనిపై విచారించిన ధర్మాసనం 3 నెలల్లో కులగణన పూర్తి చేయాలని ఆదేశించడం తమ విజయమని పేర్కొన్నారు. 2019 లో గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా నాలుగేళ్ల పాటు సాంకేతిక కారణాలతో తొక్కి పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇదే పిటిషన్ లో గత ప్రభుత్వం తమ అనుకూల శక్తులతో ఇంప్లీడ్ చేయించి కేసును ముందుకు కదలకుండా చేసినప్పటికీ మొక్కవోని దీక్షతో ఈ కేసుపై పోరాటం చేశామని తెలిపారు. ఈ తీర్పును తక్షణమే అమలు చేయాలని సమగ్ర కులగణన లెక్కలను నోటిఫై చేసి దాని ప్రాతిపదికగా తీసుకుని అధికారికంగా ప్రకటించాలని తెలిపారు.

దానికి అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. లేకుంటే బిసి లందరూ ఏకమై ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్ నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, ముద్దం గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

Editor,Printer, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128